మనిషి కథ

రాహుల్ సాంకృత్యాయన్

మనిషి కథ

రచన

రాహుల్ సాంకృత్యాయన్

అనువాదం

పోలు శేషగిరిరావు

ప్రచురణ

కావ్య పబ్లిషింగ్ హౌస్

12-13-830/13/బి, ఫ్లాట్ నెం.103,

ఎస్.ఎస్.ఆర్. అపార్ట్‌మెంట్స్,

గోకుల్‌నగర్, తార్నాక,

సికింద్రాబాద్ - 500 017.

ఫోన్ : 9989599135

ప్రచురణ : నవంబరు, 2011

ముద్రణ

చరిత ఇంప్రెషన్స్

హైదరాబాద్ - 500 020.

వెల రూ. 42/-

వేట

పూర్వం మనిషి కూడా కోతిలాగా ఉండేవాడు. అతడికి ధరించడానికి బట్టలుండేవి కావు. చలికాలం వస్తే చల్లని కొండలమీద నుంచి కిందికి దిగి వచ్చేవాడు. ఇది ఆ కాలంనాటి సంగతి. ఒక అమ్మ ఉండేది. ఆమెకు ఒక కొడుకూ, ఒక కూతురూ ఉండేవాళ్ళు. వాళ్ళకు ఇల్లంటూ యేమీ ఉండేది కాదు. చెట్టుకింద ఉండేవాళ్ళు. అదే వాళ్ళ ఇల్లు. వర్షంలో తడవకుండా ఉండటానికి మరే ఆధారమూ ఉండేది కాదు. తడిసిపోయేవాళ్ళు. తరువాత శరీరం ఆరిపోయేది. ఒకరోజు అమ్మ చాటుగావుండి ఒక కుందేలుకు రాయి విసిరింది. రాయి తగలడంతోనే కుందేలు కూలబడిపోయింది. అక్కడే చల్లబడిపోయింది. నిన్నటి నుంచి పిల్లలు ఆకలితో ఉన్నారని అమ్మకు తెలుసు. రాత్రిపూట కూడా యేడుస్తూనే నిద్రపోయారు. ఆమె చచ్చిపోయిన కుందేలును ఇంటికి



తీసుకొచ్చింది. అక్కడ ఆమె పిల్లలు మూమా – మూమీ నిద్రపోతూ వున్నారు. వాళ్ళను నిద్రలేపింది. వాళ్ళ ఒంటి మీద రోమాలు ఉన్నాయి కదూ! వర్షం కురిసినప్పుడే ఒళ్ళు కడుగుకొనేవాళ్ళు. అమ్మ జాగ్రత్తగా ఓవైపు నుంచి ఒక రాతికత్తిని తీసింది. ఆ కాలంలో ఇనుము, ఇత్తడి, రాగిలాంటి లోహాలు ఎక్కడా ఉండేవి కావు. ఆ కత్తి కూడా గట్టి రాతిముక్కతో తయారు చేసింది. దానికి బాగా పదును పెట్టింది.

కుందేలు చర్మం ఒలిచింది. ఒక మాంసపు ముక్కను మూమీ నోట్లో పెట్టింది. మూమా నోట్లో కూడా మాట రావడానికి సందులేకుండా ఓ పెద్ద ముక్కను కుక్కింది. ఆ కాలంలో కుందేలు మాంసాన్ని కాల్చుకొనడానికి నిప్పు ఉండేదికాదు. పచ్చి మాంసాన్ని గబగబా తినాలంటే వీలుపడదు. అంచేత మూమా – మూమీ పళ్ళ బలమంతా ఉపయోగించి నములుతూ వున్నారు. మూమీ చురుకైనది. కొంచెం నమిలి ఎలాగో మింగేసింది. అమ్మ మరో ముక్క ఇచ్చింది. మూమా కూడా మింగాలని చూశాడు. ముక్క పెద్దది కావడం చేత గొంతుకు అడ్డం పడింది. అమ్మ అతడి మెడమీద వెంటనే ఒక్కటి చరిచింది. లేకపోతే పాపం మూమా గతి ఏమై ఉండేదో! పచ్చి మాంసం కదూ! అంచేత తినడం చాలాసేపు పట్టింది. మొత్తంమీద సగం కుందేలును తిన్నారు. సగం

అట్టిపెట్టుకొన్నారు. సాయంకాలం కావచ్చింది. కొండగుహలోకి వెళ్ళమని చెపితే మూమీ కదలలేదు. అమ్మ దెబ్బ వేసింది. అప్పుడు వెళ్ళింది. గుహలోకి వెళ్ళే దారి చాలా చిన్నది. దారికి అడ్డంగా కట్టెలు గుట్టగా పడేసుకొన్నారు. గాలి వీస్తూ వుంది. చలివేస్తూ వుంది. పళ్ళు కటకటా కొట్టుకుంటున్నాయి. ముగ్గురూ గుహలోకి వెళ్ళారు. కుక్క పిల్లల్లాగా పడుకొన్నారు. రాత్రిపూట ఏనుగు ఘీంకరించేది. పాపం ముగ్గురూ భయపడిపోయే వాళ్ళు. మూమీ అమ్మ మాట వినడం మంచిదయింది కదూ!.

నిప్పు

అనేకవేల, కాదు లక్షల సంవత్సరాలనాటి సంగతి. ఒకరోజు చున్నీ (మూమీ అమ్మ) అడవిలో నుండి బయటకు పరుగుతీసింది. అడవికి నిప్పు అంటుకొన్నది. జంతువులు కూడా పారిపోతున్నాయి. ఎక్కడో యెండిపోయిన చెట్టు కొమ్మలు గాలికి రాచుకున్నాయి. అంతే, ఆ రాపిడికి నిప్పు పడింది. మొదట ఎండుగడ్డి అంటుకొన్నది. ఎండు కట్టెలు ముట్టుకొన్నాయి. తరువాత ఇతర చెట్లు భగ్గున మండిపోతున్నాయి. పాపం జంతువులన్నీ పారిపోలేక పోయాయి. ఒక ఏనుగు కూడా తగలబడింది. ఓ పంది కూడా కాలిపోయింది.



అప్పటికి మూమా – మూమీ కొంచెం పెద్దవాళ్ళయ్యారు. మూమా ఆరేళ్ళవాడు. మూమీ యెనిమిదేళ్ళది. ఆ నిప్పు యెక్కువ రోజులు ఉండలేదు. మరుసటి రోజు కుంభవర్షం కురిసింది. అడవిలోని నిప్పు ఆరిపోయింది. కాలినల్లబడిపోయిన అడవికి ఇద్దరు పిల్లలూ అమ్మతోపాటు తిరిగి వచ్చారు. ఒకచోట ఒక పంది తగలబడి వుంది. అటువంటివి చాలా చచ్చిపడున్నాయి. లేకపోతే పెద్దపులి, చిరుతపులి, తోడేలు మూమా – మూమీని వాటిదగ్గరకు చేరనిచ్చేవా? అమ్మ నడుముకు కట్టుకొని వున్న రాతి కత్తిని చేతిలోకి తీసుకొన్నది. ఆ కత్తి పరపరా తెగుతూ పోయింది. అమ్మ రెండు పెద్ద ముక్కలు పిల్లల నోట్లో పెట్టింది. ఒక ముక్క తన నోట్లో వేసుకొన్నది. 'ఓహో! ఓహో!' అన్నది. ఆకాలం మనిషి మాటలు కూడా యెక్కువగా పలకగలిగేవాడు కాదు. అమ్మ 'ఓహో' అనడం విని మూమా – మూమీ కూడా 'ఓహో!ఓహో!' అన్నారు. అది వాళ్ళకు చాలా రుచిగా వుంది. పంది చాలా పెద్దది. దాన్ని పూర్తిగా వాళ్ళు తినలేకపోయారు. అయితే ఆరోజు చాలా తిన్నారు. ఆనందంతో అందరూ నాట్యం చేశారు. దగ్గరలోని కాలువనీరు మురికిగా వుంది. సెలయేరు యెక్కడుందో అమ్మకు తెలుసు. ముగ్గురూ అక్కడకు వెళ్ళారు. ముందు దోసిళ్ళతో తాగారు. తరువాత కోతిలాగా నీళ్ళల్లో మూతిపెట్టి తాగారు. అప్పటికి మనిషి ఇంకా



కోతిలాగానే వుండేవాడు. ఒంటిమీద బట్టలుండేవి కావు. తినడానికి, తాగడానికి పాత్రలుండేవి కావు. మట్టి పాత్రలు మచ్చుకు కూడా లేవు. ఎండ ఎక్కువయ్యేసరికి చెట్టు కిందికి చేరారు. వర్షానికి తడవకుండా ఉండడానికి అప్పుడప్పుడు యేదయినా గుహ దొరికేది. లేకపోతే తడుస్తూనే ఉండేవాళ్ళు.

ఆ పంది ఆ రోజు నిప్పులోబడి దానంతటదే తగలబడిపోయింది. మూమా, మూమీకి ఆ పంది మాంసం చాలా రుచిగా వుంది. మళ్ళీ వెళ్ళి చూశారు. అక్కడ దాని యెముకలు మాత్రమే మిగిలి వున్నాయి. అడవిలో మాంసం మీద మోజుగల జంతువులు తక్కువ వున్నాయా! నక్కలు, గుంటనక్కలు, సింహాలు, తోడేళ్ళు, చిరుతపులులు, పెద్ద పులులు లాంటివి ఎన్నో ఉన్నాయి. గుంటనక్క వచ్చి మూతిబెట్టింది. ఇంకేముంది! తోడేలు వచ్చింది. తోడేలును చూడగానే గుంటనక్క తోక ముడిచింది. లేకపోతే తోడేలు దాన్నే తినివేసేది. ఆకలి తీరిన తరువాత కూడా తోడేలు అక్కడే నాకుతూ వుంది. ఇంతలో పెద్దపులి గాండ్రిస్తూ వచ్చింది. ఆ గాండ్రింపు విని తోడేలు కాలికి బుద్ధి చెప్పింది.

ఈ జంతువులన్నీ కేవలం మాంసమే తింటాయి. కందమూల ఫలాలు ముట్టుకొనేవి కావు. మూమా – మూమీ, వాళ్ళ అమ్మా పండ్లు కూడా తినేవాళ్ళు. కోతిలాగా ఆకులు తినేవాళ్ళు. అమ్మ గబగబా పళ్ళు తిన్నది. మూమా – మూమీకి



కూడా పళ్ళు తినిపించింది. తరువాత ఆమె గుహవైపు పరుగు తీసింది. మూమా – మూమీ ఆటలలో లీనమైపోయారు. అమ్మ యేం చేసిందో వాళ్ళకు తెలియనే తెలియదు. ఇద్దరూ సుద్దమొద్దులు. ఒకలావుపాటియెండు చెట్టు ఇంకా తగలబడుతూనే వుంది. దానిని వర్షం కూడా ఆర్పలేకపోయింది. అమ్మ మండుతున్న ఒక కట్టెను గుహలోకి తీసుకుపోయింది. ఆ కట్టెమీద ఇంకా కట్టెలు వేయకపోతే అది ఆరిపోతుంది. అమ్మ చుట్టుపక్కల వున్న యెండు కట్టెలు పోగు చేసుకొని వచ్చింది. వాటిని మండుతున్న ఆ కట్టెమీద వేస్తూ వుంది.

మరుసటి రోజు యెంతో సేపు వెదికిన మీదట ఓ గుంటనక్క పిల్ల కన్పించింది. అమ్మ పిల్లల నోటికి చేయి అడ్డం పెట్టింది. అరవొద్దని సైగ చేసింది. తాను జరుగుతూ దాని దగ్గరలోకి వెళ్ళింది. గభాలున ఒక రాయి విసిరింది. గుంటనక్క పిల్ల అక్కడే వెల్లకిలబడిపోయింది. అమ్మ దాని మాంసం ఒక ముక్క కూడా యెవరికీ పెట్టకుండా గుహలోకి తీసుకు వెళ్ళింది. ఆ గుంటనక్క పిల్లను నిప్పుల మీద కాల్చింది. తిరగేసి బోర్లేసి అన్నివైపులా బాగా ఉడికేటట్లు కాల్చింది. అప్పుడు కోసి రుచి చూసింది. 'ఓహో! ఓహో!' అంది. మూమా – మూమీ కూడా ముక్కలు తింటూ 'ఓహో! ఓహో!' అంటూ వున్నారు.

ఇప్పుడెప్పుడైనా యేదయినా జంతువును వేటాడితే దాన్ని ముందు నిప్పులో కాల్చేవాళ్ళు. మూమా – మూమీకి కూడా ఇప్పుడు పచ్చిమాంసం నచ్చడంలేదు. వాళ్ళు కూడా ఎండుకట్టెలు పోగుచేసుకొచ్చి నిప్పుమీద వేస్తూ వుండేవాళ్ళు. కొండ దిగువనే గుహుంది. చలికాలంలో ఇక్కడ చలి కూడా బాగానే వేస్తుంది. అప్పుడు మంట దగ్గర కూర్చుంటే చలి లేకపోవడం చూశారు. అమ్మ నాట్యం చేస్తూ ఉంది. చేతులెత్తి నమస్కరిస్తూ వుంది. ఆహా! ఈ నిప్పు మాంసాన్ని కాల్చుతున్నది. చలిని పారగొడుతున్నది.

ఒకరోజు సింహం వచ్చింది. అమ్మ భయపడిపోయింది. ఆమె విసిరే రాయి తగిలి కుందేలు ఛస్తుంది కాని సింహం ఎక్కడ ఛస్తుంది. పిల్లలు కూడా భయంతో ఏడుస్తూ ఉన్నారు. రాత్రిపూట గదా! మంట మీద ఎండిన ఆకులూ, ఎండు కట్టెలూ పడేశారు. చుట్టూ వెల్తురు పట్టపగలులా కన్పించింది. మంటని చూసి

సింహం పారిపోయింది. ఆరోజు అమ్మకు విషయమేమిటో పూర్తిగా అర్థం కాలేదు. మంటని చూసి పెద్ద పెద్ద జంతువులు (ఏనుగులు కూడా) పారిపోతాయని ఒకరోజు తెలుసుకున్నది. అంతే, అమ్మ ఇక తెంపు లేకుండా మంటనీ, ఎండిపోయిన ఆకులనూ, ఎండు కట్టెలను నిలువచేస్తూ ఉంది.

పెద్ద వేట

మూమా – మూమీల అమ్మ నిప్పు అవసరాన్ని తెలుసుకోవడంతో ఎంతో మంచి పని జరిగింది! ఇప్పుడు మంట వేయగానే సింహాలూ, పులులూ పారిపోతున్నాయి. మంట దగ్గర కూర్చోవడంతోనే చలి కూడా వేయడం లేదు. మాంసం లభించిన రోజు అమ్మ దాన్ని కూడా నిప్పుల్లో కాల్చుతూ వుంది. మాంసం రుచి పెరిగింది. మనుషులకు భద్రత పెరిగింది. పళ్ళకు పూర్వం కలిగినంత శ్రమ కలగడం లేదు. తరువాత నిప్పు వాళ్ళ అమ్మ వరకే పరిమితం కాలేదు. వాళ్ళు వొంటరిగా ఉండేవాళ్ళు కాదు. చిరుత పులులతో, పెద్ద పులులతో, ఏనుగులతో, సింహాలతో అడవి అంతా నిండి వుంది. అటువంటప్పుడు మనిషి ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతాడా? వాళ్ళు అప్పుడప్పుడు ఎముకలతో,

కర్రలతో లేక రాతిముక్కలతో చేసిన ఆయుధాలతోనే వర్షంలో లోతుగా ఓ పెద్ద గుంట తవ్వేవాళ్ళు. అనేకమంది స్త్రీ పురుషులు కలిసి ఆ గుంటను తవ్వేవాళ్ళు. రాత్రిపూట అందరూ యెండు కట్టెలు చేతపట్టుకొని వెదురు పొదలకు నిప్పు పెట్టేవాళ్ళు. అక్కడ ఏనుగులు అడవి అరటిచెట్లనూ, వెదురు కర్రలనూ మేస్తూవుండేవి. అనేక వందలమంది కర్రపుల్లలతో తోలువాద్యాన్ని మోగిస్తూ 'హో-హో' అని కేకలు వేస్తూ పోయేవాళ్ళు. ఆ కేకలువిని ఏనుగులు ప్రాణాలు దక్కించుకొనడానికి పరుగులు తీసేవి.

అది నిప్పు కదా! కాని అదేదో దయ్యమనీ, మన ఏనుగులకన్నా పెద్దదనీ ఏనుగులు అనుకొనేవి. పరుగెత్తేటప్పుడు ఏనుగులు వెనక్కు తిరిగి కూడా చూసేవి కావు. అలా అమితమైన భయంతో పారిపోతూ ఆరోజు రెండు ఏనుగులు గుంటలో పడ్డాయి. ఇప్పుడవి పైకి రాలేకుండా వున్నాయి. మిగిలిన ఏనుగులు అంతులేకుండా పారిపోయాయి. మనుషులు చెట్లకు అడుగునా పైనా నిప్పంటించారు. ఏనుగులు పారిపోవడంతోనే మనుషులు వెనక్కు తిరిగి వచ్చారు. గుంటలోని ఏనుగులు ఆకలితోనైనా చచ్చేవి. చాలారోజులు కృశించి కుళ్ళిపోయేవి. కాని ఆ మనుషులు ఏం చేశారో చూశారూ! అంతకు ముందే ఎండుగడ్డి, ఎండుటాకులూ అమర్చిపెట్టారు. క్షణంలో నిప్పంటించి గుంటలోకి



విసిరారు. అక్కడ పరుగు తీయడానికి వీలులేదు. పాపం ఏనుగులు గోలచేస్తూ కాలిపోతున్నాయి. అనేకమంది మనుషులు ఎండుగడ్డిని వెలిగించి గుంటలోకి విసురుతూ వున్నారు. ఓ గంటసేపు ఏనుగులు అరుస్తూనే వున్నాయి. మొదట గున్న ఏనుగు, తరువాత పెద్ద ఏనుగు మౌనం వహించాయి. అయినా ఆ మనుషులు గుంటను వదలలేదు. ఇంకా కొన్ని లావుపాటి కట్టెలు విసురుతూనే వున్నారు. గుంటను కట్టెలతో నింపేశారు. రాత్రి చాలా పొద్దుపోయింది. అప్పుడు వాళ్ళందరూ తమ ఇంటికి తిరిగి వచ్చారు. ఇల్లంటే ఆ గుహ. అక్కడ మంట వేసుకొని అనేకమంది అమ్మలు తమ పిల్లలను దగ్గరపెట్టుకొని కూర్చున్నారు. మనిషి దగ్గర భగ్గున మండే నిప్పు వుందని ఇప్పుడు సింహాలకూ, పులులకూ తెలిసిపోయింది. గుహలో వున్న ఆహారం అందరూ కలిసి తిన్నారు. ఆ కాలంలో ఇది నా వస్తువు ఇది నీ వస్తువూ అనేది యెవరికి తెలియదు. తల్లులు అన్ని పనులూ చేసేవాళ్ళు. పురుషులు వాళ్ళమాట ప్రకారం నడిచేవాళ్ళు.

మరుసటి రోజు ఉదయం అందరూ బయలుదేరి వెళ్ళారు. పిల్లలను కూడా చంకనేసుకొని వెళ్ళారు. అప్పటికి మనిషికి మాట కూడా యెక్కువగా తెలియదు. 'హోయ్, గూం-గాం' అంటూ చేతులు ఊపుతూ మాట్లాడేవాళ్ళు. అందరూ గుంట దగ్గరకు చేరారు. నిన్నటి నిప్పు చాలాభాగం ఆరిపోయింది. కొంచెం



దూరంలో మెరకమీద ఒక సెలయేరు వుంది. వెంటనే ఆ మనుషులు కొమ్ములతో తవ్వి కాలువ తీశారు. గుంటలోకి నీళ్ళు వచ్చి పడుతున్నాయి. నిప్పు పూర్తిగా ఆరిపోయింది. రాతికత్తులు తీసుకుని అందరూ గుంటలోకి దిగలేకుండా వున్నారు. అందరికన్నా పెద్దదైన అమ్మమాట వాళ్ళందరూ వింటారు. ఆమె పిల్లలతో సహా తల్లులను గుంటలోకి పంపించింది. వాళ్ళు మాంసం తింటూ అప్పుడప్పుడూ పెద్ద పెద్ద మాంసపు ముక్కలను పైకి విసిరేస్తూవున్నారు. వాళ్ళు ఎన్నిరోజులు తిన్నా ఏనుగును పూర్తిగా యెక్కడ తినగలరు. తినలేక పోయారు. అది కుళ్ళిపోతూవుంది. అప్పుడు దాన్ని వదిలేశారు.

ఇల్లు – కుటుంబం

నేను ఏనుగుల వేట విషయం చెప్పాను గదూ! నగ్నంగావున్న ఆ మనుషులు చైనా వాళ్ళలాగానూ, టిబెట్ వాళ్ళలాగానూ వున్నారు. అయితే వాళ్ళు లేప్చా (కిరాత) జాతికి చెందినవాళ్ళు. వాళ్ళవి చప్పిడి ముక్కులు. ముఖంమీద వెంట్రుకలు తక్కువగా ఉంటాయి. శరీరం కొంచెం పసుపు వర్ణంలో వుంది. వేసవిలో కలింపాంగ్ లేక డార్జిలింగ్ అడవులకు వెళ్ళిపోయేవాళ్ళు. షికారు చేయడానికి కాదు, ఆహారం వెతుక్కుంటూ వెళ్ళేవాళ్ళు. ఎప్పుడైనా ఏదయినా



జంతువు లభిస్తే ఇక వాళ్ళ సంతోషం ఇంతా అంతా కాదు. కాని జంతువు రోజూ యెక్కడ లభిస్తుంది! అప్పటికి జంతువులు కూడా తెలివి మీరిపోయాయి. అవి ఇప్పుడు మనిషిని కూడా వేటాడుతున్నాయి. అయితే మనుషులు తమ గుహలో మంటలు వేసుకొనేవాళ్ళు. అవి చూసి జంతువులు పారిపోయేవి. మనుషులకు తేనె కూడా మహాయిష్టంగా వుండేది. పిల్లలు తేనెకోసం తపించిపోయేవాళ్ళు. తేనెటీగలు చాలా ఎత్తైన కొండలపైన చెట్లమీద తుట్టెలు పెట్టేవి. మనిషి వాటి దగ్గరకు వెళ్తే కుట్టేవి. చిన్న ఈగలు కుడితే అంతపెద్ద బాధఉండేది కాదు. కాని తుమ్మెదల్లాంటి పెద్ద ఈగలు కుట్టి చంపేవి. మనుషులు పండ్లు, దుంపలు వెతుక్కుంటూ ఉండేవాళ్ళు. కొన్నిటిని యెండబెట్టి గుహలోనే భద్రపరచుకొనేవాళ్ళు. ఆ కాలంలోని ఓ మంచి విశేషం యేమిటంటే స్త్రీలు-పురుషులు, బాలురు-వృద్ధులు అందరూ కలిసి వుండి ఎవరికి తగిన పనులు వాళ్ళు చేసేవాళ్ళు. అందరూ కలిసి తినేవాళ్ళు. ఏ వస్తువునూ పంచుకొనేవాళ్ళు కాదు. అన్నివస్తువులూ అందరివీ. వాళ్ళ పిల్లలు కూడా 'నాదీ, నీదీ' అంటూ పోట్లాడుకొనేవాళ్ళు కాదు. వాళ్ళ దగ్గర ఆట బొమ్మలు యెక్కువగా ఉండేవి కావు. మట్టివే కొన్ని కుక్కలూ, గొర్రెలూ, ఆవులూ, ఏనుగులూ ఉండేవి. ఇంకా మనిషికి తోడుగా ఉండే జంతువులు యేవీ లేవు. కుక్క కూడా మనిషి

దగ్గరకు వచ్చేది కాదు. ఎంచేతనంటే ఆకాలంలో మనిషి కుక్కను కూడా చంపి తినేవాడు. అప్పుడు మనిషి యే జంతువునూ విడిచిపెట్టేవాడు కాదు. మనిషి పిల్లవాడు అంతా కోతిపిల్ల మాదిరిగానే వుండేవాడు. పసిపిల్లవాడిని తల్లి చంకనేసుకొని తిరిగేది. నడవగలిగిన వాడైతే తనంతట తానే తల్లివెంట నడిచేవాడు. లేకపోతే గుహబయట ఆడుకొంటూ ఉండేవాడు. అతడికి పులి, సింహం, ఏనుగు మొదలైనవాటి భయం ఎక్కువగా ఉండేది. అయితే అటువంటి జంతువులు వచ్చినప్పుడు పిల్లలు గుహలోకి పారిపోయేవాళ్ళు. అక్కడ మంట మండుతూ వుండేది. ఆకలైతే గుహలో కూర్చొని వున్న ముసలి అవ్వను అడిగి ఏదయినా పెట్టించుకొని తినేవాళ్ళు. ఆమె గుహలో వున్నదేదో పిల్లలకు పెట్టేది. మామూలుగా వాళ్ళ అమ్మలే వాళ్ళకు యేదయినా తిండి పెడుతూ వుంటారు. వాళ్ళ భాష మాత్రం యేం భాష! పిల్లలు యెప్పుడైనా పోట్లాడుకొంటే దెబ్బలు తినేవాళ్ళు.

మనుషులు పాతిక పాతిక మంది కలిసి వుండేవాళ్ళు. ఒంటరిగా యెలా వుంటారు? ఒంటరిగా వుంటే వలయంగా ముట్టడించి వేటాడగలిగేవాళ్ళు కాదు. ఏ పనీ చేసుకోగలిగేవాళ్ళుకాదు. కడుపు నిండితే మాత్రం హుషారుగా ఆడుతూ పాడుతూ ఆనందంగా ఉండేవాళ్ళు. ఒక్కొక్కప్పుడు ఒక గుహలో ఉండేవాళ్ళూ, మరొక్కప్పుడు మరో గుహలో వుండేవాళ్ళూ, పరస్పరం యుద్ధం చేసుకొనే వాళ్ళు. రాళ్ళతో, కర్రలతో తలలు పగలగొట్టుకునేవాళ్ళు. చంపుకొనేవాళ్ళు. చచ్చిన వాళ్ళను తినేసేవాళ్ళు కూడా. ఏం మనుషులు!

కొందరు పిల్లలు మంచి వాళ్ళుగా ఉండేవాళ్ళు. పోకిరి పిల్ల వాడెవడైనా బలహీనంగా వున్న పిల్లవాణ్ణి కొడితే మంచి పిల్లవాడు ఆ పోకిరి పిల్లవాణ్ణి కొట్టేవాడు. పిల్లలందరూ మంచి పిల్లవాణ్ణి ప్రేమించేవాళ్ళు. అతడిమాట వినే వాళ్ళు. మూమా కూడా మంచి పిల్లవాడే. చాలా బలం గలవాడు. చాలా మంచివాడు.

ఒకరోజు పోట్లాట

మనిషి కొన్ని లక్షల సంవత్సరాల వరకు ఎముకలతోనూ, రాళ్ళతోనూ తయారుచేసుకున్న ఆయుధాలతోనే వున్నాడు. ఒక్క నిప్పు మాత్రం అతడి దగ్గర కొచ్చింది. పాత్రలకు బదులు అరటి ఆకులూ, ఇంకా యితర ఆకులూ ఉండేవి.

అయితే ఒకనాటి సంగతి. నాలుగైదు మైళ్ళ దూరంలో రెండు గుహలున్నాయి. వాటిల్లో రెండు బృందాలు వుంటున్నాయి. ఒకరోజు కొండమీద వున్న తేనెతుట్టెను తెచ్చుకోవడం కోసం ఉమా అవ్వ మనుషులు వెళ్ళారు. కాని సుమా అవ్వమనుషులు మొదట నుంచీ ఆ తేనెతుట్టె కోసం కనిపెట్టుకొని వున్నారు. రాత్రిపూట తేనెటీగలు తుట్టెలో జొరబడతాయి. ఆ సమయంలో ఉమా అవ్వ మనుషులు వెళ్ళారు. వాళ్ళు తుట్టె దగ్గరకు చేరుతూ వుండగా సుమా అవ్వ మనుషులు పరుగెత్తుకుంటూ వచ్చారు. ఇంకేముంది! కేకలూ, అరుపులూ! ఉమా అవ్వ మనుషులు కొద్దిమందే వున్నారు. సుమా అవ్వ మనుషులు వాళ్ళను బాగా చితగ్గొట్టారు. ఎవడూ చావలేదు కాని కొందరి తలలు పగిలాయి. రక్తం కారుతూ వుంది. అందరూ ప్రాణాలు దక్కించుకొని ఇంటికి పరుగు తీశారు. సుమా అవ్వ మనుషులు ఉద్రేకంతో అన్నారు. 'ఇంత ధైర్యమా!' మరుసటి రోజు



ఉదయమే తోలు నగారా మోగింది. రాతి ఆయుధాలూ, ఎముకల ఆయుధాలూ తీసుకుని సుమా అవ్వ మనుషులు బయలుదేరారు. ఉమా అవ్వ మనుషులు కూడా జాగ్రత్తలోనే వున్నారు. వాళ్ళు గుహలో కూర్చొని వున్నారు. శత్రువులు దగ్గరకు రావడంతోనే రాళ్ళు విసిరారు. అయితే పోట్లాడే వాళ్ళలో పురుషుల కన్న స్త్రీలే యెక్కువగా ఉన్నారు. అందరూ గొప్ప వీరత్వం గలవారే. రాతి దెబ్బలు తింటూ కూడా వాళ్ళు గుహలోకి ప్రవేశించారు. సుమా అవ్వ ఉమా అవ్వను సవాలు చేసింది. 'రావే, లోపల దాక్కున్నావెందుకే? బయటికిరా!' ఉమా అవ్వ కూడా భయపడేది కాదు. ఇరువైపులా వున్న స్త్రీలూ – పురుషులూ పరస్పరం ఢీ కొన్నారు. వాళ్ళు రాతి ఆయుధాలతో దాడి చేయడమే కాకుండా పళ్ళతో కొరుకుతున్నారు. ఉమా అవ్వ మనుషులు పదిమంది అక్కడికక్కడే చనిపోయారు. సుమా అవ్వ మనుషులు కూడా అయిదుగురు మరణించారు. మిగిలిన వాళ్ళు పారిపోయారు. ఏం మనుషులు! ఓ చిన్న తేనెతుట్టె కోసమే గదా ఇదంతా!

కుక్కతో దోస్తీ

మూమా మూమీలు ఒక కుక్కను పెంచుకున్నారు. మొదట్లో నక్కలు, రాబందులలాగే కుక్కలు కూడా అడవిలోనే ఉండేవి. మనుషులు వాటిని చూసి పారిపోయేవాళ్ళు. తోడేళ్ళు కూడా కుక్కలకు బంధువులే. అవి కొరికి తినేసేవి. పిల్లల కోసం అవి పొంచి వుండేవి. ఆ కాలంలో మనిషి ఆహారం కోసం కుక్కలను కూడా వేటాడేవాడు. మూమా – మూమీ చిన్నపిల్లలు. అయినా వాళ్ళూ వేటకు వెళ్ళారు. ఆ రోజు ఆడకుక్కలనూ, మగకుక్కలనూ ఎన్నో చంపారు. ఒకచోట చాటుగా ఏడెనిమిది కుక్క పిల్లలు ఒకదాని మీదొకటి పాకుతూ 'కై కై' అని అరుస్తూ వున్నాయి. అవి మూమా తల్లి కంటబడ్డాయి. అందరూ అటు పరుగెత్తారు. ఇప్పటివరకు మనిషి పిల్ల కుక్కలనూ, పెద్దకుక్కలనూ చంపి తిన్నాడు. మూమా – మూమీ అక్కడకు వెళ్ళి చూస్తే కుక్క పిల్లలు వాళ్ళకు చాలా ముద్దొచ్చాయి. మూమా రెండింటిని యెత్తుకొన్నాడు. మూమీ రెండింటిని యెత్తుకొన్నది. ఇతర పిల్లలు కూడా పరుగెత్తుకొచ్చారు. అందరూ కుక్క పిల్లలను

యెత్తుకొన్నారు. అవి రెండు మూడు రోజుల కుక్కపిల్లలు. కళ్ళు కూడా తెరవలేదు. అవి పాలు మాత్రమే తాగుతున్నాయి. పిల్లలందరూ పట్టుబట్టి ఆ కుక్క పిల్లలను చంపనివ్వలేదు, తిననివ్వలేదు. వాళ్ళు వాటికి మాంసం పెట్టబోయారు. కాని అవి తినడం లేదు. ఒకటి రెండు రోజుల్లో అవి చావుకు తయారయ్యాయి. మూమా – మూమీ వాళ్ళ అమ్మ చాలా తెలివైనది. ఆమె నీళ్ళలో తేనె కలిపి నాకించింది. ఆ కాలంలో మనిషివద్ద వుండే జంతువేదీ లేదు. పాలు యెక్కడ నుంచి తెస్తారు? అమ్మ నాలుగు పిల్లల్నీ బతికించలేకపోయింది. కాని రెండు మాత్రం బ్రతికాయి. ఆ కుక్కపిల్లలకు చిల్లా, చిల్లీ అని పేర్లు పెట్టారు. రెండూ కళ్ళు తెరిచాయి. తరువాత చిల్లా – చిల్లీ మాంసం కూడా తింటున్నాయి. బాగా లావెక్కాయి. అవి హీనజాతికి చెందినవి. లేకపోతే మనిషిని కరిచేవి కూడా. మూమా – మూమీ వాటిని యెత్తుకొని తిరుగుతూ వుండేవాళ్ళు. తమ స్నేహితులను కూడా వాటితో ఆడుకోనిచ్చేవాళ్ళు. రెండూ ఆరు మాసాలలో పెద్దవైపోయాయి. రెండూ ఎరుపు రంగు పిల్లలు. మూమా – మూమీ వాటిని తమ ఒళ్ళోనే నిద్రపుచ్చేవాళ్ళు. చలికాలం కుక్కలు దగ్గరగా వున్నందువలన చలివేయదుగదా!



ఇవి తొలిసారిగా పెంచిన కుక్కలు గదా! వీటికి అంత తెలివిలేదు. అయినా పిలవగానే పరుగెత్తుకొచ్చేవి. అవి ఇంతవరకు కుక్కలను చూడనేలేదు. ఒకవేళ చూసినా అవి చచ్చినవీ, కాల్చబడుతున్నవీ. అవి మనజాతివేననే సంగతి వాటికి తెలియనే తెలియదు. అవ్వ దగ్గరగా కుందేలు పరుగెత్తడం చూశాయి. అరుస్తూ రెండూ పరుగుతీశాయి. అదెక్కడ చిక్కుతుంది? కాని అటునుంచి కొందరు మనుషులు వచ్చేశారు. కుందేలు వెనక్కు మళ్ళింది. చిల్లా – చిల్లీ నోటికి చిక్కిపోయింది. రెండూ దానిని కరిచి కరిచి చంపేశాయి. దాని మాంసం తింటూ వున్నాయి. మూమా – మూమీకి నోరూరుతూ వుంది. కాని దగ్గరకు వెళ్ళగానే చిల్లా – చిల్లీ మొరుగుతున్నాయి. మాంసం అంతా అవి తినలేకపోయాయి. మిగిలిన దాన్ని మూమా – మూమీ కాల్చుకొని తిన్నారు. కుక్కలు వేటాడతాయని జనానికందరికీ తెలిసిపోయింది. ఇటువంటివి పది పదిహేను కుక్కలుంటే యెంత బాగుండునని అందరూ అనుకొంటున్నారు.

అంతే, అప్పటి నుంచి కుక్కతో మనిషికి స్నేహం యేర్పడింది.

మున్నీ చేపను పట్టింది

కొన్నివేల సంవత్సరాలు గడిచిపోయాయి. కనైలా అడవిలో లేప్చా (కిరాత) జాతి మనుషులే వుండేవాళ్ళు. వాళ్ళు గుడిసెలో వుంటున్నారు. యాభై – అరవై మంది స్త్రీలూ – పురుషులూ, బాలురూ – వృద్ధులూ వుంటున్నారు. వాళ్ళకు ఒకే గుడిసె వుండేది. చాలా పెద్దది. గడ్డితో, చెత్తతో వేసుకొన్నారు. ఒకమూల నిప్పు వుంది. మనుషులు అడవిలో వేటాడి జంతువులను తెచ్చేవాళ్ళు. ఒక్కొక్కప్పుడు చెరువు నీటిలో చేపలు పట్టి తెచ్చేవాళ్ళు. అది చూసి ఒకరోజు చున్నూ, మున్నీ కూడా తమ స్నేహితులతోనూ, పిన్నమ్మ పిల్లలతోనూ కలిసి చెరువులో జొరబడ్డారు. 'మేము కూడా చేపలుపడతాం' అన్నారు. అమ్మ, పిన్నమ్మలు వాళ్ళను నీళ్ళలో దిగవద్దన్నారు. పెద్దవాళ్ళందరూ అడవిలోకి జొరబడిన తరవాత పిల్ల సైన్యం చెరువు మీద బడింది.

నీళ్ళల్లో దిగి ఒడ్డుకు దగ్గరగా వుండి నీళ్ళలో చేతులుపెట్టి చేపలను వెతుకుతున్నారు. (అలా వెతికితే చేపలు చేతికి చిక్కుతాయా?) మూమా చేతిలోకి ఒక ఎండ్రకాయ వచ్చింది. దానిని నీటిలో నుంచి పైకి తీశాడు. దాని పెద్ద పెద్ద కాళ్ళు చూసి మళ్ళీ నీటిలోకి వదిలేశాడు. భయంతో వణికిపోతున్నాడు. తెలివైన ఒక పెద్ద పిల్లవాడు తెలియజెప్పాడు. 'అది చేపే' ఇంకెవరూ పట్టుకోలేదు. కాని మూమా మాత్రమే అంత పెద్ద ఎండ్రకాయను పట్టుకొన్నాడు. దాన్ని మళ్ళీ నీటిలోకి విసిరేశాడు గదా! అమ్మా, పిన్నీ చూస్తే యెంత సంతోషించేవాళ్ళు! ఇప్పుడు మూమాకు విచారం కలుగుతూ వుంది. కాని నీళ్ళలోకి విసిరేసిన ఎండ్రకాయ యెక్కడయినా మళ్ళీ చేతికందుతుందా? పిల్లలు చేపలు పట్టడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. అదే సమయంలో ఓ పిన్ని కూతురు 'చచ్చానా'! అంటూ అరచింది. నీటిబయట వేలుపట్టుకొని వుంది మూమా కొంచెం చేయి లాగి చూశాడు. రక్తం కారుతూ వుంది. పిల్లలందరూ భయపడిపోయారు. పిన్ని కూతురు బొటనవేలు చాలా నొప్పి పెడుతూవుంది. ఆమె కన్నీళ్లు కారుస్తూ నేలమీదపడి దొర్లుతూ ఏడుస్తూ వుంది. ఇతర పిల్లలు ఆమెను యెత్తుకొని గుడిసెలోవున్న అవ్వ దగ్గరకు తీసుకొనిపోయారు. అవ్వ అన్నది, 'చేప చేతిలో కొచ్చిందా?' 'అవును, వచ్చింది. నేను గట్టిగాపట్టుకొన్నాను. అది తన్నుకొంటూ వుంది. అప్పుడే



నా బొటనవేలుకు ముల్లుగుచ్చుకున్నది. చాలా నొప్పిగా వుంది. 'అమ్మో,చచ్చాను'! అన్నది.

అవ్వ ఓదార్చింది, 'మున్నీయేడవకు, అది సింహం చేప. దాని ముల్లు చాలా పదునుగా వుంటుంది. అది గుచ్చుకొంటే చాలా నొప్పిగా వుంటుంది.' ఒకరోజు చేపలు పట్టినప్పుడు అందులో సింహం చేప కూడా వచ్చింది. అమ్మ అన్నది. 'ఇది యెర్రని సింహం చేప'. ఇంకా అది బతికే వుంది. కదులుతూ వుంది. అమ్మ చిన్నదైన మున్నీతో అన్నది. 'తీసుకొంటావా మున్నీ?' ఆ మాట అనగానే మున్నీ దాన్ని చేత్తో యెత్తుకొన్నది.

ఆ కాలంలో మనిషికి ఉప్పు యెటువంటిదో తెలియదు. అతడు తినలేదు. ఉప్పు వేస్తే సింహం చేప చచ్చిపోతుంది. ముల్లు విసరడం మరచిపోతుంది. అమ్మ కాల్చి యిచ్చింది. ఆ సింహం చేప అందరికీ చాలా రుచిగా ఉన్నట్లనిపించింది. తల మధ్యలో గట్టిగా పట్టుకొంటే సింహం చేప ముల్లు విసరలేదు.

నలుపురంగు మనుషులు - పసుపు రంగు మనుషులు

ఒకరోజు పిల్లలు అమ్మలతోనూ, పిన్నమ్మలతోనూ కలిసి నది ఒడ్డుకు వెళ్ళారు. పిల్లలు అక్కడే వేట ఆట ఆడుకొంటూ వున్నారు. వాళ్ళ దగ్గర విల్లు, బాణాలు కూడా ఉన్నాయి. బాణాలకు చివర ఎముక ముక్కను గానీ గట్టి రాతిముక్కగానీ కట్టేవాళ్ళు. ఇంకా ఆ కాలపు మనిషికి ఇనుము, రాగి జాడ తెలియదు. పిల్లలు ఆటలాడుతూ వున్నారు. వాళ్ళు బాణంమీద జిగురు పూశారు. దాంట్లో ముల్లు గుచ్చారు. ఒకరోజు మూమా ఒక పక్షిమీదికి బాణం వదిలాడు. అది చిన్నపక్షి. ఆ బాణం తగిలి విలవిలలాడుతూ పడిపోయింది. పిల్లలు దాన్ని పట్టుకొన్నారు. చాలా చిన్నపక్షి. ఏం చేస్తారు?

ఒకరోజు మూమా – మూమీకి ఇంకా ఆ యింటి పిల్లలందరికీ చాలా ఆశ్చర్యం వేసింది. ఆరోజు కూడా వాళ్ళు నది ఒడ్డున ఆడుకొంటూ వున్నారు. నది అవతలవైపున చూశారు. చాలామంది మనుషులు గోలచేస్తూ వస్తున్నారు. సంగతేమిటో మొదట అర్థం కాలేదు. దగ్గరకు రాగానే చూశారు. తమ గ్రామం వాళ్ళూ, ఇతర గ్రామంవాళ్ళూ ఉన్నారు. ఆకాలంలో గ్రామాలెక్కడున్నాయి? ఆ పెద్ద గుడిసె ఒకటి ఒక గ్రామం. ఇతర గ్రామంవాళ్లు కూడా లేప్చా జాతివాళ్ళే.



వాళ్ళకు ఒకరిమాట ఒకరికి తెలుస్తుంది. వాళ్ళు తమలో తాము చాలా తక్కువగానే పోట్లాడుకొనేవాళ్ళు.

అయితే వాళ్ళిప్పుడు మరో రకం మనుషుల్ని ముగ్గురిని పట్టుకొస్తున్నారు. వారిలో ఒక స్త్రీ కూడా వుంది. ఆ ముగ్గురు కొత్త మనుష్యులు బొగ్గులాగా చాలా నల్లగా వున్నారు. వాళ్ళను చూసి మూమా – మూమీ పటాలం అంతా భయపడిపోయింది. వాళ్ళు మాత్రం స్పష్టంగా కొంచెం పసుపువర్ణంలో వున్నారు. వాళ్ళు ఆ నలుపురంగు మనుషులు యేదయినా అడుగుతూ వుంటే వాళ్ళు యేం చెపుతున్నారో యెవరికీ అర్థం కావడం లేదు. వాళ్ళు వేరే భాష మాట్లాడుతున్నారు. వాళ్ళను బాగా కొట్టారు. వాళ్ళు బాగా యేడుస్తున్నారు. పిల్లలు కూడా వాళ్ళ దగ్గరకు వెళ్ళి చూస్తూ వున్నారు. మూమా ఆ నలుపు రంగు స్త్రీ ఒంటిమీద చేయివేసి రుద్దాడు. ఎంత తెలివితక్కువ పిల్లవాడు! నలుపురంగు ఒంటికి పులుముకొన్నదేమోనని అనుకొంటున్నాడు. వాళ్ళు కూడా దయ్యం ఆట ఆడేటప్పుడు ఒంటికి నలుపురంగు పులుముకొనే వాళ్ళు.

నలుపురంగు మనుషులు వుంటారనీ, వాళ్ళ భాష వేరుగా ఉంటుందనీ కూడా ఈరోజు పిల్లలకు తెలిసిపోయింది. మరుసటి రోజు వాళ్ళు ఈ విషయం చర్చించుకొంటూ వుండగా ఒక పెద్ద పిల్లవాడు అన్నాడు. 'ఆ ముగ్గురు మనుషుల్నీ

చంపి దేవతలకు పూజ చేయండి. తరువాత వాళ్ళ మాంసాన్ని కాల్చుకొని తినండి'. ఆకాలంలో వాళ్ళు అటువంటి అడవి మనుషులే. వాళ్ళకు మంచి విషయం తెలియనే తెలియదు. తమ ఇంటి వాళ్ళను ప్రేమించడం ఒక్కటే వాళ్ళకు తెలుసు. వాళ్ళకు తిండీ తిప్పలు చూడాలి. తన కడుపు ఒక్కటే నింపుకోవడం చాలా చెడ్డపని. వాళ్ళు పగటిపూట భయపడేవాళ్ళు కాదు. కాని రాత్రి కావడంతోనే అన్నిచోట్లా దయ్యాలను చూస్తూ వుండేవాళ్ళు. పెద్దవాళ్ళు కూడా ఒంటరిగా బయటికి వచ్చేవాళ్ళు కాదు. ఎటువంటి మనుషులు వాళ్ళు!

కొత్త స్నేహితులు

కొత్త చున్నూ – మున్నీకి ఒకరోజు చిన్న లేడి పిల్ల కన్పించింది. అది అప్పటికి రెండు మూడు గంటల క్రితమే పుట్టింది. వేటగాళ్ళు వచ్చి పడ్డారు. లేడి తల్లి పారిపోయింది. కాని లేడిపిల్ల పరుగెత్తలేకపోయింది. చున్నూ – మున్నీ అక్కడికి చేరుకున్నారు. అది వాళ్ళకు ముద్దొచ్చింది. వాళ్ళు దాన్ని పట్టుకొని ఇంటికి తీసుకొచ్చారు. తోలుతాడుతో దాన్ని కట్టేశారు. ఇంకా అది పాలుతాగే పిల్ల. అది అసలు మాంసం తినేదే కాదు. దాన్ని దేవతలకు బలిగా అర్పించాలని



పెద్దవాళ్ళు యెంతో ప్రయత్నించారు. కాని పిల్లలు అలా చేయనివ్వలేదు. వాళ్ళు మెత్తని గడ్డి దాని నోటికందిస్తున్నారు మొదట తినలేదు. పాలు దొరక్కపోవడంచేత అది చావుకు సిద్ధమయింది. అక్కడ ఒక పిన్నికి పాలుతాగే పసిపిల్లవాడు ఉన్నాడు. అంచేత ఆ పిన్ని లేడి పిల్లకు కూడా నాలుగురోజులు తన పాలిచ్చింది. తరువాత అది గడ్డి తినడం ప్రారంభించింది. అదే సమయంలో కుక్క కూడా ఈనింది. అది మంచి కుక్క. అది కూడా తన పిల్లలకు పాలు తాగించింది. అయితే యిప్పుడు మనిషి దగ్గర కుక్కలుంటున్నాయి. అవి వేటకు సహాయపడుతున్నాయి. రాత్రిపూట కాపలా కాస్తున్నాయి. తమ మనుషులను అవి కరిచేవి కావు. ఇతరులను చూడటంతోనే మొరిగేవి. లేడిని అవి కూడా గుర్తుపట్టాయి. అంచేత దానిని బాధించేవి కావు.

ఆ చిన్న లేడిపిల్లతో మనుషుల పిల్లలు బాగా ఆడుకొనే వాళ్ళు. కుక్క పిల్లలు కూడా పరుగులు తీస్తూ ఆటలు చూపిస్తూ వుండేవి. ఎముకలు చాలా దొరికేవి. ఎముకల కంటుకొన్న మాంసం దొరికేది.పిల్లలు కీచురాళ్ళు తెచ్చి పడేస్తుండేవాళ్ళు. లేడికోసం రాతిచాకుతో మెత్తని పచ్చిగడ్డి కోసుకొచ్చేవాళ్ళు. చేతులతో కూడా గడ్డి పెరికి తెచ్చేవాళ్ళు. క్రమంగా లేడి పెద్దదయింది. అది ఆడలేడి. మగలేడి అయితే కొమ్ములుండేవి. చున్నూ – మున్నీ ఒకవేళ దాన్ని విసిగిస్తే కొమ్ములు విసరగలిగేది.

మున్నీ దాని తల నిమురుతూ ఉండేది. చున్నూ దాన్ని ముద్దుపెట్టుకొనేవాడు. మున్నీ కూడా కుక్కలకు, కుక్క పిల్లలకూ తమ తిండిలోనుంచి కొంత పెట్టవలసివచ్చేది. ఆడలేడి కేవలం గడ్డి మాత్రమే తినేది.

ఒంటరిగా అడవిలోకి వెళ్ళడం మంచిపని కాదని లేడికి కూడా తెలుసు. మున్నీ కూడా ముచ్చటగా చెప్పేది. 'లేడి రాణీ, అడవిలో సింహం ఉంటుంది. పెద్దపులి ఉంటుంది. తోడేలు ఉంటుంది. నీవు ఒంటరిగా వెళ్తే నిన్ను తినేస్తాయి'. ఆ లేడి, పిల్లలతో పాటే తిరుగుతూ ఉండేది. పరుగులు తీస్తూ వుండేది. దానితోపాటు యెవరూ పరుగెత్తలేక పోయేవాళ్ళు. ఒకరోజు చున్నూ పరుగు తాబేలు నడకలాగా వుంది. లేడి చాలా దూరం వెళ్ళిపోయింది. పిల్లలందరూ నవ్వుతున్నారు. చప్పట్లు చరుస్తున్నారు. లేడి చున్నూను ఓడించింది. ఒకరోజు కుక్కకూడా పరుగెత్తింది. కాని అది కూడా లేడికన్నా వెనకబడిపోయింది. లేడి యెంతో వేగంగా పరుగుతీస్తుందనుకొన్నారు.

అది వర్షాకాలం. నదిలో నీరు పెరిగిపోతూ వుంది. లేడి అవతల ఒడ్డున వుండిపోయింది. చీకటి పడబోతూ వుంది. అందరూ భయపడిపోతున్నారు. రాత్రికి దాన్ని తప్పకుండా తోడేలు తినేస్తుంది. పిల్లలందరూ బిగ్గరగా పిలుస్తూ ఉన్నారు. 'ఓలేడీ వచ్చేసెయ్, ఓ లేడీ వచ్చేసెయ్, చీకటి పడుతూ వుంది.' అక్కడ లేడి ఆలోచించి ఆలోచించి అమాంతంగా యెగిరి నదిలోకి దూకింది. ఈదుకొంటూ వచ్చేసింది.

ఆడుతూ పాడుతూనే

నలుపు రంగువాళ్ళు, పసుపురంగువాళ్ళు రెండు రకాల మనుషులున్నారు. వాళ్ళల్లో పరస్పరం యుద్ధాలు జరుగుతూనే వుండేవి. వాళ్ళ దగ్గర గుంజుకొనడానికి యేముంది?వాళ్ళు అడవి మనుషులు. ఈనాడైతే అన్నా చెల్లెళ్ళు కూడా పరస్పరం పోట్లాడుకొంటూ వుంటారు. కాని త్వరలోనే ఇద్దరు పిల్లలూ పోట్లాడుకోవడం మానివేస్తారని తండ్రికి తెలుసు. లేకపోతే ప్రజలు వాళ్ళను అడవి మనుషులు అంటారు. ఒకసారి చున్నూ, మున్నీ అద్భుతమైన పనిచేశారు.

ఆ కాలంలో జవలూ, గోధుమలూ, వడ్లూ లేక మామిడికాయలూ, నేరేడు కాయలూ అన్నీ అడవుల్లో వుండేవి. గడ్డి. చెత్త ఉన్నట్లుగానే, అన్నీ ఒకే ప్రదేశంలో ఉండేవి కావు . ఒకరోజు చున్నూ పండిన జవగింజల కంకిని ఒకదాన్ని చూశాడు. దాని గింజలు అక్కడక్కడ రాలిపడి వున్నాయి. వాటిని పోగుచేసుకొన్నాడు. నెమ్మదిగా మున్నీ చెవులో ఊదాడు. 'ఒక ఆట ఆడదాం. ఈ గింజలను భూమిలో చల్లుదాం'. తరువాత వాళ్ళు అలాగే చేశారు. జవలు మొలకెత్తాయి. వర్షం కురిసింది. మొక్కలు పెద్దవయ్యాయి. పిల్లలు తమ లేడిని వదిలారు. అది మేస్తూ వుంది. ఇప్పుడు గడ్డి తెచ్చే శ్రమ తప్పింది. చున్నూ తన ప్రతాపం చూపించాడు. తరువాత పిల్లలందరూ జవలుచల్లి పైరు పెంచేవాళ్ళు. లేడిని మేపేవాళ్ళు. ఇంకా మనిషి ధాన్యం తినడం నేర్చుకోలేదు.

అడవిలో మేత, నీళ్ళు తగ్గిపోవడంతోనే జంతువులు మరో అడవిలోకి వెళ్ళి పోయేవి. మనుషులు కూడా తమ గుడిసెను వదిలి పెట్టి జంతువుల వెంటబడి మరో అడవికి వెళ్ళేవాళ్ళు. జంతువులకు మేత గడ్డి. మనిషికి ఆహారం జంతువులు. మనుషులు అడవిలో గింజలు చల్లి వుంటే, అవి మొలిచి పచ్చగా వుంటే ఇంకా కొన్నాళ్ళు అక్కడే ఉండి పోయేవాళ్ళు. మరో పది పదిహేను రోజులు గుడిసెను వదిలిపెట్టవలసిన పని ఉండేది కాదు. పూర్వపు గుడిసెను

విడిచి పెడుతుంటే చున్నూ – మున్నీకి, వాళ్ళ స్నేహితులకూ చాలా దుఃఖం కలిగేది. ఒక్కొక్కప్పుడు 'మేం ఇక్కడే వుంటాం, మాకు ఈ చోటు బాగా నచ్చింది' అనేవాళ్ళు. కాని జంతువులు అక్కడ నుంచి వెళ్ళిపోయినప్పుడు, చెరువులు కూడా యెండిపోయినప్పుడు అక్కడ వుండి యేం తింటారు? యేం తాగుతారు? చివరకు యేడుస్తూ పిల్లలు కూడా వెళ్ళి పోయేవాళ్ళు.

ఒకసారి వీళ్ళు కొండలున్న అడవిలో నివసిస్తూ వున్నారు. అక్కడ వీళ్ళు ఓ పెద్ద కొండచిలువను చూశారు. అది ఓ పెద్దచెట్టు లాగానేవుంది. కొండముచ్చులొచ్చాయి. ఒక కొండముచ్చు చాలా కొంటెదిగా వుంది. అది జాగ్రత్త పడకపోయినట్లయితే కొండచిలువ దాన్ని పట్టుకొని మింగేసేది. కొండముచ్చు చాలా చురుకుగా వుంటుంది. కొండచిలువ మహా సోమరిపోతు. అది కొండముచ్చును పట్టుకొనడానికి నోరు అటు తిప్పగానే కొండముచ్చు ఎగిరిదూకి మరోవైపుకు వెళ్ళిపోయేది. ఒకసారి అది ఎగిరిదూకి కొండచిలువ వీపుమీదే కూర్చున్నది. కొండచిలువ పరుగు తీసింది. శరీరాన్ని అటూ ఇటూ ఊపింది. కాని కొండముచ్చు అలాగే కూర్చొని నవ్వుతూ వుంది. మిగిలిన కొండముచ్చులకు అంత సాహసం కలగలేదు. అయితే అవి చప్పట్లు చరుస్తూ తమాషా చూస్తున్నాయి. జనం ఆ కొండ ముచ్చును ఒక వీరునిగా మెచ్చుకొన్నారు.



నూతన సంబంధాలు

చున్నూ – మున్నీ ఒక కొండ గుహలో ఉంటున్నారు. అక్కడ నుంచి వాళ్ళు చాలా దూరంవరకు చూడగలరు. ఒకరోజు ఒక సింహం బయలుదేరిపోతూ ఉంటే చూశారు. సింహం పండ్లు తినదనీ; కోతి, మాంసం తినదనీ అవ్వ చెప్పింది. అయితే సింహం కోతి మాంసాన్ని తింటుంది. తరువాత కోతి యేం సైగ చేసిందో కాని సింహం ఆగిపోయింది. కోతి ఒంటరిగానే వెళ్ళి ఓ చెట్టుమీదికెక్కింది. అక్కడకు దగ్గరలోనే ఓ చిన్న నది ప్రవహిస్తూ వుంది. నది ఒడ్డున నాలుగైదు ఆవులు మేస్తున్నాయి. ఆ కాలంలో వున్నవన్నీ అడవిజాతి ఆవులే. కోతి బిగ్గరగా 'వూ!' అన్నది. సింహం ఒక్క దుముకు దుమికి చెట్టు కిందికి వచ్చింది. మరో దూకుతో దాని పళ్ళూ పంజాలూ ఒక ఆవు వీపుమీద దిగబడ్డాయి. ఆవు 'బా' అని అరచి కింద పడిపోయింది. మిగిలిన ఆవులు పారిపోయాయి. సింహం ఆవు నెత్తురు తాగింది. కటకటా దాని మాంసం తినేసింది. చున్నూ, మున్నీ అంటున్నారు. 'కోతి ఆవును యెందుకు చంపించింది? గుంటనక్క చంపించిందంటే అది వేరే విషయం. సింహం విడిచిపెట్టిపోయిన మాంసం దానికి దక్కుతుంది'. మున్నీ అన్నది. 'సింహం నా నేస్తం, నేను కూడా

గొప్పదాన్ని అనీ కోతి అనుకొంటున్నది. బడాయికొట్టడం దానికి ఇష్టంగా వుంటుంది. కాని ఏ రోజైతే వేటకు జంతువు దొరక్క ఆ సింహం ఆకలితో వుండవలసి వస్తుందో ఆ రోజు దాన్నికూడా వదలదని ఆ కోతికి తెలియడంలేదు'. ఆ రోజు నుంచి మున్నీ కోతులను చూడగానే తిడుతూ ఉంటుంది. వాటిమీదికి రాళ్ళు కూడా విసిరేది. "అలా జరగదు. యెవరో అవ్వ ఈ కథ కల్పించి ఉండవచ్చు. పిల్లలు కథలు చెప్పమని వేధిస్తూ వుంటే రోజూ నాలుగైదు కథలు ఆమె మాత్రం యెక్కడ నుంచి తీసుకొస్తుందీ?" అని కొందరంటారు.

చాలా రోజులు గడిచిపోయాయి. చున్నూ, మున్నీకి అడవిలో తిరుగుతూ కిందికి దిగినప్పుడు దారిలో ఒక చిన్న కోతిపిల్ల దొరికింది. ఏనుగుల గుంపులో ఓ పెద్ద కొండలాంటి ఏనుగు యజమానిగా వుంది. మరో ఏనుగు పెద్దదయ్యేసరికి యజమానిగా ఏనుగు దానిని గుంపులో నుంచి తరిమేసింది. ఇప్పుడది కూడా శక్తి కలిగినటువంటి ఏనుగు అయ్యింది. అది యుద్ధానికి వచ్చింది. రెండు ఏనుగులూ తొండం తొండం మెలివేసుకొని దంతానికి దంతం రుద్దుకొన్నాయి. ఒకదాని దంతం సగం విరిగిపోయింది. రెండు ఏనుగుల ఒళ్ళంతా రక్తంతో నిండిపోయింది. ఆ యుద్ధంలో చివరకు యజమానిగా వున్న ఏనుగు ఓడిపోయి, ప్రాణం దక్కించుకొని పారిపోయింది. ఆ రెండు కొండల్లాంటి ఏనుగులు ఘీంకరిస్తూ పోట్లాడుకొంటున్న సమయంలో ఒక కోతి ఒళ్ళో నుంచి ఆ కోతిపిల్ల కింద పడిపోయింది. కిందికి దిగి పిల్లను తెచ్చుకొనడానికి ఆ కోతికి ధైర్యం చాలలేదు. అన్ని కోతులతో పాటు అది కూడా ఆ ఆడవిలో నుంచి పారిపోయింది. ఏనుగులు కూడా పోట్లాడుకొని వెళ్ళిపోయాయి. కోతిపిల్ల 'పోం-పోం' అని అరచి అరచి అలసిపోయింది. మున్నీ దానిమీదికి విసరడానికి రాయిపైకెత్తింది. కాని అది ఒంటరిగా ఉండటం చూసి వెంటనే మున్నీకి దానిమీద జాలి కలిగింది. దగ్గరకు వెళ్ళి చూసింది. అది భయంతో వణకిపోతూ వుంది. ఆమె దాన్ని యెత్తుకొన్నది. బొటనవేలు నోట్లోపెడితే అది చీకుతూవుంది. పాలు తాగుతున్నానేమోనని అనుకొంటూ వుండొచ్చు. పాపం అకలిగొని వుంది. ఒక పండురసం నోట్లో పిండింది. ఇప్పుడా కోతిపిల్ల నిజంగా ఆడటంలోను,

ఆడించటంలోను ఆరితేరిపోయింది. అది ఒకప్పుడు చున్నూ మెడమీద యెక్కి కూర్చునేది. ఒకప్పుడు వీపుమీద యెక్కి కూర్చునేది. పండిన పండ్లు కనిపిస్తే పరుగెత్తుకొంటూ పోయి చెట్టెక్కేది. కొమ్మలు ఊపేది. పండ్లు టపటపా కింద రాలేవి. చున్నూ అన్నాడు. 'కుక్కతో జంతువులను వేటాడినట్లుగా కోతితో మనం పండ్లను వేటాడొచ్చు'.

నవీన కల్పన

కొన్నివేల సంవత్సరాలు గడిచిపోయాయి. ఇప్పుడు మున్నీ పెద్దది. చున్నూ చిన్నవాడు. కావడానికి ఏడెనిమిదేళ్ళవాళ్ళే. కాని తెలివైనవాళ్ళు. ఇప్పుడు మనుషులు తమ రాతి ఆయుధాలను అరగదీసి మెరిపిస్తున్నారు. మామూలు రాళ్ళతో కాకుండా అన్నిటికన్నా శ్రేష్ఠమైన చెకుముకి రాయితో కత్తులు, గొడ్డళ్ళు తయారు చేస్తున్నారు. వాటితో కట్టెలను కూడా నరికేవాళ్ళు. పదునుపోతే మళ్ళీ రుద్దేవాళ్ళు. గట్టి గట్టి రాళ్ళు గుహ దగ్గరే ఉండేవి. మున్నీ కూడా రాయి యెత్తుకొచ్చింది. అక్కా తమ్ముళ్ళు అప్పుడప్పుడు పోట్లాడుకొంటున్నప్పటికీ తమ వస్తువులు పంచుకొని తినేవాళ్ళు. వాళ్ళు రాళ్ళు అరగదీసుకొని తమ కత్తులు తయారు చేసుకొనేవాళ్ళు. దానితో చిన్న కర్ర నరుక్కొనే వాళ్ళు. కొండ కింద ఓ



పెద్ద సెలయేరు ఉంది. అమ్మ, బాబు ఇంకా మిగిలిన వాళ్ళు అక్కడ చేపలను పట్టడానికి వెళ్ళే వాళ్ళు. వాళ్ళకు వల తయారు చేసుకోవడం తెలియదు. రాతి ఆయుధాలతో, కొమ్ముతో చేసిన ఈటెలతో చేపలను చంపేవాళ్ళు. వాళ్ళు పడవకూడా తయారు చేసుకొన్నారు. ఎట్లా? రాతి ఆయుధాలతో మొత్తం చెట్టును నరికి పడేసేవాళ్ళు. ఎండిపోయిన తరువాత ఒకవైపు నిప్పు పెట్టేవాళ్ళు. మూడోవంతు కాలిపోగానే నిప్పు నార్పేవాళ్ళు. రాతి ఆయధాలతోనే తొలిచి తొలిచి బొగ్గునంతా తీసేసేవాళ్ళు. మరికొంచెం తొలిచి పడవ తయారు చేసేవాళ్ళు. వాళ్ళు దానిమీదే కూర్చొని వేటాడేవాళ్ళు. చలికాలంలో మంచూరియా కన్న పై భాగాల నుంచి, ఉత్తర దిక్కు నుంచి చాలా పక్షులు ఆ సెలయేటికివచ్చేవి. ఎంచేతనంటే ఆ ప్రదేశాలలో చలి అధికంగా ఉండేది. మంచు పడుతూ వుండేది. ఆహార పదార్థాలన్నీ మంచులో పూడిపోయేవి. పాపం ఆకలితో ఉండవలసి వచ్చేది. అంచేత తమ రెక్కల విమానాల నెక్కి టిబెట్ మీదుగా అక్కడికొచ్చేవి. ఇక్కడ మనిషి బాణాలతో పక్షులను పడగొట్టేవాడు.

మున్నీ తండ్రి మరో కొత్త యుక్తి పన్నాడు. నునుపైన రాతి ఆయుధాలతోపాటు మనిషి మొట్టమొదటిసారిగా మట్టిపాత్రలు తయారుచేశాడు. వాటిని నిప్పులో యెర్రగా కాల్చేవాడు. అందులో నీళ్ళు కాగేవి. నీళ్ళు మొదట్లో తోలు సంచులతో



తెచ్చుకునేవాళ్ళు. ఇప్పుడు మట్టి కుండల్లో నీళ్ళు తెచ్చుకొంటున్నారు.

మున్నీ తండ్రి ఓ మట్టి కుండ తలమీద బోర్లించుకొన్నాడు. అది బాగా నల్లబడిపోయేటట్లుగా కాల్చుకునేవాడు. కళ్ళతో చూడటానికి కుండకు రెండు రంధ్రాలు వేసుకొన్నాడు. రాత్రిపూట ఆ కుండముఖం తగిలించుకొని సెలయేట్లోకి దిగేవాడు. నెమ్మదిగా నీటిలో మునిగి జరుగుతూ పోయేవాడు. ఏదో కుండ నీటిమీద తేలుతూ వుందని పక్షులు అనుకునేవి. అతడు పక్షుల గుంపులోకి వెళ్ళివాటి కాళ్ళుపట్టుకొని నీటి లోపలికి గుంజేవాడు. ఇతర పక్షులకు తెలియజేయడానికి, దానిని విలవిలా తన్నుకొనడానికి కూడా అవకాశం చిక్కేదికాదు. నీటిలోపల కొంచెం సేపటిలోనే అది చచ్చిపోయేది. నడుముకుఉన్న తాడుకు పక్షులను కట్టుకుని కుండ మళ్ళీ కదులుతూ వుండేది. ఇదే విధంగా రాత్రిపూట చాలా పక్షులను చంపి నీటిలోనుంచి బయటికి తెచ్చేవాడు. చలికాలమైతే నీటిలో దిగడంతోనే మొదట చలివేసేది. తరువాత చలి వుండేది కాదు. ఇంకా మనిషి గుడ్డలు తయారుచేయడం లేదు. ఎలుగుబంటి చర్మాన్నిగానీ, గొర్రె చర్మాన్నిగానీ తప్పకుండా ధరించేవారు. ఒకప్పుడతడు మాంసాన్ని నిప్పులమీద కాల్చుకొనేవాడు. ఇప్పుడతడు మాంసాన్ని కుండలో కొంచెం వండుకుంటున్నాడు. అవ్వకు అది అంత ఇష్టంగా ఉండేదికాదు. ఆమె పచ్చిమాంసమే తినేది. ఆమెకు గట్టి పళ్ళున్నాయి. కదూ! అమ్మ కూడా అప్పుడప్పుడు చేపలను వేటాడటానికి వెళ్ళేది. అయితే అరుదుగానే వెళ్ళేది.

చిత్రకారుడు మున్నా

ఆ మున్నా యెట్లా వున్నాడు? కొండల్లో తెల్లమట్టీ, ఎర్రమట్టీ, పసుపురంగు మట్టీ దొరికేది. ఒకరోజు అమ్మ, బాబు, పిన్నీ, పినతండ్రీ అందరూ గుహలో ఏవో చిత్రాలు గీయడం అతడు చూశాడు. వాళ్ళు ఒక పూజకోసం ఆ చిత్రాలు తయారుచేసుకుంటున్నారు. ఆ కాలంలో మనుషులు భూత-ప్రేత-పిశాచాలకు చాలా భయపడేవాళ్ళు. అంచేత దేవతలనూ, భూతాలనూ సంతృప్తి పరచడంకోసం పూజ చేసేవాళ్ళు. కాని విషయం ఏమంటే దేవుడూ లేడు దయ్యమూ లేదు. ఆ

కాలంలోని మనుషుల తెలివితేటలు మాత్రం యేపాటివి! అయితే ఇంతకూ మున్నా యేం చేశాడు? ఎర్రమట్టిని నీళ్ళలో కరిగించాడు. కర్రపుల్లతో ఓ చిన్న కలం తయారుచేసుకున్నాడు. గుహలో ఒక అంచుకువెళ్ళి చిత్రాలు గీస్తూ వున్నాడు. మొదట సింహం, తరువాత కోతి – ఈ రెండింటినీ గీశాడు. కోతి చెట్టుమీద కూర్చొని వుంది. సింహం నేలమీద నిల్చొని వుంది. కోతి చేతితో ఆవులను చూపిస్తూ వుంది. తరువాత మున్నా పందుల చిత్రాలు కూడా గీశాడు. మనుషులను కూడా గీశాడు. తనలాంటి వాళ్ళనే గీశాడు. మనుషుల తలమీద ఆడవాళ్లకు ఉన్నట్టుగా పొడువాటి వెంట్రుకలున్నాయి. మీసాలు కూడా తక్కువగా ఉన్నాయి. లేపాచ్చాజాతివాళ్ళకు చిన్న మీసమే వుంటుంది గదా! తరువాత మున్నా పోట్లాడుకుంటున్న రెండు ఏనుగుల చిత్రాలు గీశాడు. అనేకరోజుల వరకూ మున్నా చిత్రాలు తయారుచేస్తూనే వున్నాడు. ఏడెనిమిది రోజుల తర్వాత అతడి స్నేహితుడొకడు అలోచించాడు – 'మున్నా రోజంతా యెక్కడ వుంటున్నాడో, ఏం చేస్తున్నాడో చూద్దాం' అతడు నెమ్మదిగా మున్నాకు వెనుకపక్కగా వెళ్ళి చూశాడు. వచ్చి పినతండ్రి చెవిలో ఊదాడు. పినతండ్రి వెళ్ళి చాటు నుండి చూశాడు. మున్నా ఆ చిత్రాలను పినతండ్రికన్నా బాగా గీశాడు. అతడి వయస్సు ఏడేళ్ళకన్నా మించిలేదు. జనానికందరికీ తెలిసిపోయింది. అందరూ వచ్చారు.

మున్నా పురుషులను నగ్నంగానే చిత్రించాడు. వేసవికాలంలో ఉన్నట్లుగా. చిత్రాలు గీసేవాళ్ళలో మున్నా మొదటివాడు కాదు. కాని చిత్రకళా ప్రదర్శన మాత్రం ఇదే మొదటిది. రెండో బృందం మనుషులు కూడా విన్నారు. వాళ్ళు కూడా చూడటానికివచ్చారు. అందరూ మున్నాను 'చిత్రకారుడు మున్నా' అని పిలుస్తున్నారు. చాలామంచి చిత్రాలే తయారయ్యాయి. ఒక్కో బొమ్మ ఏదో మాట్లాడబోతున్నట్లుగా యెంతో సజీవంగా వుంది.

మున్నా పెద్దవాళ్ళు గీసిన చిత్రాలను చూసేవాడు. కళ్ళు, ముక్కు, చెవులు యథాతథంగా చిత్రించాలనుకున్నాడు. అయితే అతడు తన స్నేహితుల ముఖమూ, ముక్కూ, చెవులూ చూసి వాటిని రేఖలలో బంధించాడు. మున్నాకు ఈ పని చాలా ఇష్టంగా ఉంది. అనేక సంవత్సరాలపాటు చూస్తూ చూస్తూ గీతలు గీస్తూ వున్న అతడికి అందరి కళ్ళూ, అందరి చెవులూ ఒకేరకంగా లేవని తెలుస్తూ వచ్చింది. అతడు గుహలన్నిటి నిండా అనేక చిత్రాలు గీశాడు. వేల సంవత్సరాలు గడిచాయి. వర్షపు జల్లుపడి కొన్నిచిత్రాలు రూపు మాసిపోయాయి. గుహలో చాలా లోపల ప్రక్కనవున్న చిత్రాలు కొంచెం మాసిపోయాయి. కొన్ని యింకా పూర్తిగా చెరిగిపోలేదు. ఈనాటికీ యూరప్‌లోనూ, భారతదేశంలోనూ అనేక గుహలలో అటువంటి చిత్రాలు కన్పిస్తూనే వుంటాయి.



కొత్త కొత్త ఉపయోగాలు

మనిషి అయిదులక్షల సంవత్సరాలకాలం రాతి ఆయుధాలతోనే జీవనంగడుపుతూ వచ్చాడు. ఆ రాతియుగపు కథతో పాఠకులు విసిగిపోయి వుండొచ్చు. అయితే ఇప్పటి మున్నా – మున్నీ రాగియుగంలో పుట్టారు. మనిషి ఒకసారి కొండల్లో తిరుగుతూ – తిరుగుతూ ఎక్కడో ఒక రాగిముక్కను చూశాడు. దాని పదును చాలాకాలం నిలిచి వుంటున్నది. ఇటువంటి రాగి ముక్కలు ఇంకా కొన్ని దొరికితే బాగుండునని మున్నా తండ్రి అనుకున్నాడు. ఒకరోజు గుడిసెకు నిప్పు అంటుకొన్నది. ఆ రాగిముక్క కరిగి మరోరూపం ధరించటం చూసాడు. తరువాత దాన్ని మళ్ళీ కరిగించి చూశాడు. రాగివర్ణంలో వుండే పెద్ద పెద్ద రాళ్ళను చూశాడు. వాటిని కూడా కరిగించాడు. ఇప్పుడు మనిషి పెద్ద పెద్ద రాళ్ళలో నుంచి రాగిని బయటకు తీస్తున్నాడు. రాతిలో కలిసి వున్న ఇనుము కూడా చేతికందింది. ఇనుమును కరిగించడానికి మరింత యెక్కువ వేడికావాలి. రెండూ – రెండున్నర వేల సంవత్సరాల తరువాత మనిషి ఇనుమును కూడా తయారు చేయడం ప్రారంభించాడు. రాగి యుగంలో మరింత మంచి మట్టి పాత్రలు తయారవుతున్నాయి. పొలాల్లో ధాన్యం పండిస్తున్నారు. ఆవులను కూడా

పెంచుకొన్నారు. మొదట్లో చంపి తినడానికి, తరువాత పాలకోసం, ఆవుపాలు, గేదెపాలు తాగవచ్చుననే విషయం చైనావాళ్ళు తెలుసుకోలేకపోయారు. బహుశా లేప్చా జాతిలోని తండ్రులకూ, తాతలకూ కూడా పాలు తాగవచ్చుననే విషయం తెలియదనుకుంటాను. తరువాత కొందరు మనుషులు పడమటి దిక్కు నుంచి వచ్చారు. వాళ్ళు యెక్కువగా పాలు తాగుతూ వుండేవాళ్ళు.

మున్నా – మున్నీ ఇప్పుడు ముతకవస్త్రాలు ధరించడం మొదలుపెట్టారు. వాళ్ళ తల్లీ తండ్రీ కూడా వస్త్రాలు ధరిస్తున్నారు. అవి చాలా ముతకగా వుండేవి. అవి నూలు వస్త్రాలు కావు. జనపనారలాంటి నారతో తయారైన వస్త్రాలు, ఉన్ని వస్త్రాలు. మనిషి గొర్రెలనూ, మేకలనూ ఆడవుల నుంచి పట్టుకొచ్చి పెంచుకొంటున్నాడు. మనిషి చంపి తినడానికే తమను పెంచుతున్నాడనే విషయం ఆ జీవాలకు తెలియదు. ఒకవేళ తెలిస్తే పారిపోయేవి కదూ? మనిషి చాలా తెలివితేటలు కలవాడు కదా! అంచేత వానరుడికి చుట్టమైన ఈ నరుడు ఏనుగును పట్టుకోగలిగాడు. జంతుప్రదర్శనశాలలో యెన్నో ఏనుగులు మనిషి చెప్పడంతోనే ఒక్కసారి వచ్చి తమాషా చూపిస్తాయి చూడలేదూ! కాని ఒక విషయం. మొదట తండ్రితోపాటు తల్లి కూడా వేటకు వెళుతూ వుండేది. ఒకప్పుడు స్త్రీ అందరికీ యజమానురాలుగా ఉండేది. పురుషులందరూ ఆమె మాట ప్రకారం నడిచేవాళ్ళు.



ఆ కాలంలో అక్కని తమ్ముడికన్నా గొప్పదానిగా చూసేవాళ్ళు. కాని ఇప్పుడు రాగిచేతికందడంతోనే, పొలాల్లో విత్తనాలు చల్లడం ప్రారంభం కావడంతోనే పురుషులు ఇంటిపని అమ్మకూ, అక్కకూ ఒప్పగించారు. వాళ్ళు భోజనం తయారుచేసేవాళ్ళు. వంటపనంతా వాళ్ళే చేస్తూ వుండేవాళ్ళు. మొదట్లో ఆడపిల్లలకు కూడా మగపిల్లల ఆటలు నేర్పబడుతూ వుండేవి. యుద్ధం వస్తే ఆడవాళ్ళు కూడా ఆయుధాలు తీసుకొని యుద్ధానికి వెళ్ళవలసి వచ్చేది. కాలం గడుస్తున్న కొలదీ స్త్రీ హీనురాలుగానూ, పురుషుడు శ్రేష్ఠుడుగానూ భావింపబడుతూ వచ్చారు. మగవాడు సంపాదించేవాడయ్యాడు. ఆడది అన్నం ఉడకేసి పెట్టేదయ్యింది. మున్నీ ఇప్పుడు ఆటబొమ్మతో ఆడుకొంటూ వుంది. మున్నా విల్లు – బాణంతో ఆడుకొంటూ వున్నాడు. ఇప్పుడు మున్నీ బొమ్మకోసం స్వెటర్ అల్లుతూ వుంది. మగపిల్లవాణ్ణి తల్లి 'అది ఆడదానిపని' అంటూ పని చేయనివ్వదు.

గుంటనక్క

మున్నా – మున్నీ కుక్కను కూడా పెంచారు. మనిషిదగ్గర గొర్రెలు కూడా వున్నాయి. మేకలు కూడావున్నాయి. అయితే అవన్నీ అడవి గొర్రెలూ, అడవి మేకలూ, అవులు. గేదెలు కూడా అడవి జంతువులే. అయితే మనుషులు వాటిని పెంపుడు జంతువులుగా చేసుకొన్నారు. గొర్రెలనూ, మేకలనూ సింహాలు కూడా కావాలంటాయి. పులులు కూడా కావాలంటాయి. తోడేళ్ళు కూడా కావాలంటాయి. ఈ జంతువులు గ్రామం దగ్గరకు రాగానే కుక్కలు మొరుగుతూ వుంటాయి. అప్పుడు జనం మేల్కొంటారు. మున్నా – మున్నీ కూడా పాలు తాగుతూ చాలా పుష్టిగా వున్నారు. ఒకనాడు పిల్లలు గ్రామం బయట ఆడుకొంటూ వున్నారు. కుక్క కూడా వాళ్ళపక్కనే వుంది. బంతి చాలా దూరం వెళ్ళిపోయింది. మున్నా దానిని తీసుకొని రావడానికి వెళ్ళాడు. ఒకచోట గుంటలాంటి ప్రదేశంలో ఓ గుంట నక్క కూర్చొని వుంది. మున్నా గుంటనక్కతో అన్నాడు – 'మాస్టరూ మీరు యెప్పటినుంచి యిక్కడ వున్నారు? చాలా శ్రమపడుతున్నట్టున్నారే?'

నక్క లేచి నిలబడింది. చూశారు గదా! ఇప్పుడు మున్నా కుక్కను పిలుస్తాడు.

అతడు నెమ్మదిగా అడవివైపుకు వెళ్తూవున్నాడు. మున్నా యెందుకు ఊరుకొంటాడు? అతడు కుక్కను పిలిచాడు. కుక్క పరుగెత్తుకొంటూ అక్కడకి వచ్చింది. గుంటనక్క వైపు సైగ చేయడంతోనే కుక్క దానివెంట బడింది. గుంటనక్క శక్తి కొలదిగా పరుగుతీస్తూ వుంది. 'ఓలియా ఓలియా' అంటూ పిల్లలందరూ దానివెంట పరుగెత్తుతూ వున్నారు. చివరకు కుక్క ఆ నక్కను పట్టుకొన్నది. నక్క తన తోకను రెండు కాళ్ళకింద అణచిపెట్టుకొని కుక్క దగ్గరకు రావడంతోనే దాన్ని కరిచింది. కుక్క కూడా దాన్ని అనేకచోట్ల కరిచింది. ఇంతలో పిల్లలు కూడా దగ్గరకొచ్చేశారు. రాళ్ళు, మట్టిగడ్డలూ విసురుతున్నారు. అప్పటికీ గుంటనక్క లొంగలేదు. అదే సమయంలో మిగిలిన కుక్కలను తీసుకొని పెద్దవాళ్ళు అక్కడికి చేరుకొన్నారు. కుక్కలన్నీ కలిసి గుంటనక్కను కరిచి పడగొట్టాయి. తరువాత మనుషుల కర్ర దెబ్బలు పడగానే గుంటనక్క ప్రాణం విడిచింది.

దాన్ని యెందుకు చంపారు? ఎంచేతనంటే ఆ గుంటనక్క మెత్తగా వుండే మేకపిల్ల మాంసం కోసం వచ్చింది. కాని వ్యవహారం తారుమారయింది. మనుషులు గబగబా మంటవేశారు. అక్కడే యెవడో మండుతున్న కట్టెను వదిలి వెళ్ళాడు. దానిమీద యెండు కట్టెలు వేయగానే మంట పెద్దదయింది. మనుషులు గుంటనక్కను మంటమీద పెట్టారు. తిరగాబోర్లా వేసి కాల్చారు. నడుములకు



కట్టుకొన్న రాగి కత్తులు విప్పారు. గుంట నక్కను ముక్కలు ముక్కలుగా కోసి అక్కడ పెట్టారు. ముందుగా పిల్లలకు తలా ఒక ముక్క ఇచ్చారు. అందరూ కాల్చిన మాంసాన్ని ఎంతో మక్కువగా తిన్నారు. ఆ కాలంలో మనిషి అన్ని జంతువుల మాంసాన్ని తినేవాడు. ఈ కాలంలో ప్రతిమనిషితో పాటు అతడికులం పేరో, జాతిపేరో లాంటివి పెట్టుకొని ఉన్నట్లుగా ఆ కాలంలో ప్రతి మనిషి పేరునూ జంతువుల పేర్లూ, వృక్షాల పేర్లు అంటిపెట్టుకొని వుండేవి. మనిషి జాతిపేరు యే జంతువుదైతే ఆ మనిషి ఆ జంతువును చంపేవాడు కాదు. నక్కపేరు గల జాతికి చెందిన వ్యక్తి అక్కడ యెవడూ లేడు. అంచేత గుంటనక్కను యెవరూ విడిచి పెట్టలేదు. చూస్తూ చూస్తూ వుండగానే గుంటనక్క మనుషుల కడుపుల్లోకి వెళ్ళి పోయింది. ఆ మనుషులు గుంటనక్కకు ఎటువంటి శిక్ష విధించారు!

ఆటలూ – ఆటబొమ్మలూ

మొదట్లో కొన్ని లక్ష సంవత్సరాల వరకు మనిషి వట్టి రాతి ఆయుధాలతోనూ, వేట జంతువులనూ, ఆడవి పండ్లనూ ఆశిస్తూ వుండేవాడు.



ఇప్పుడు మున్నీ తల్లి మట్టి పిసికి తన చేతితో పాత్రలు తయారు చేస్తున్నది. మున్నీ కూడా అమ్మకు సహాయపడటానికి తప్పకుండా అక్కడ కూర్చొనేది. కాని మూడు సంవత్సరాల వయసు వున్న మున్నీ వట్టి మట్టే తింటూ వుండేది. అయినా మున్నీ అమ్మ దాన్ని చెడ్డపనిగా భావించేది కాదు. ఆమె తన మున్నీకి ఒక కోతినీ, ఒక ఎలుగుబంటినీ చేసి యిచ్చింది. అమ్మ పాత్రలతో పాటు మున్నీ బొమ్మలైన కోతీ, ఎలుగుబంటీ కూడా ఎండలో ఎండాయి. తరువాత నిప్పులో కాలి యెర్రబడ్డాయి. ఆ కాలంలో మున్నా మున్నీ కన్నా పెద్దవాడు. అతడు తన చెల్లిని చాలా ప్రేమతో చూసేవాడు. అతడు బొగ్గునూరి, అందులో కొవ్వు కలిపి నలుపురంగు తయారుచేసి తెచ్చాడు. అతడన్నాడు, 'చెల్లీ చూడు! నేను నీ కోతికీ, ఎలుగుబంటికీ నోరు, ముక్కు గీసిపెట్టనా'?

మున్నీ కోతిని తీసికొని మున్నా మొదట నల్లని గీతతో నోరు గీశాడు. తరువాత కళ్ళు గీశాడు. వీపువైపు పైకి లేస్తున్న తోకను కడా అమర్చాడు. ఎలుగు బంటిని కూడా సరిచేసి అలాగే అన్నీ గీశాడు. ఆ కాలంలో ప్రత్యేకంగా కుమ్మరులు, కమ్మరులు యెవరూ ఉండేవాళ్ళు కాదు. అన్ని పనులూ ఆ మనుషులు తమ చేతులతోనే చేసుకొనేవాళ్ళు. హస్తకౌశలం గలవాడు అందమైన పాత్రలూ, ఆటబొమ్మలూ తయారు చేసేవాడు. ఒక్కొక్కడికి అంత నైపుణ్యం ఉండేది కాదు.

మున్నీ ఆటబొమ్మలు చాలా బాగున్నాయి. అమ్మ ఒకరోజున మట్టితో ఒక బొమ్మను కూడా తయారుచేసింది. కాని అది జపాను ఆటబొమ్మలాగా కళ్ళు మూస్తూ తెరుస్తూ ఉండేది కాదు.

ఇప్పుడు మనం స్పుట్నిక్ యుగంలో వున్నాము. ఆ కాలంలో మనిషి రైలునూ, మోటారునూ గురించి ఆలోచించ గలిగేవాడే కాదు. అప్పటికి ఇంకా పిల్లలు పుస్తకాలు తీసుకొని చదువు కొనడానికి స్కూలుకు వెళ్ళే వాళ్ళే కాదు. ఈ ఆటలు ఆడటమే వాళ్ళ చదువు. పాడగా పాడగా చాలా పాటలు కంఠస్థమయ్యేవి. అవ్వ కథలు చెప్పేది. రాతియుగం మనిషి చాలా తక్కువ మాటలే మాట్లాడగలిగేవాడు. అతడి అంకెలు కూడా తక్కువే. కేవలం పది, ఇరవై వరకు మాత్రమే లెక్క బెట్టగలిగేవాడు. అతడి కళ్ళముందు చాలా కొద్ది వస్తువులే వుండేవి. ఇల్లు లేనే లేదు. ఇక ఫర్నిచర్‌తో పనేముంది? కాని రాగిని తయారు చేసుకొన్న తరువాత మనిషి మట్టి ఇళ్ళు కట్టుకోవడం ప్రారంభించాడు. అవి చిన్నచిన్న ఇళ్ళు. రాగి గొడ్డలితో కర్రలు నరుక్కొనేవాడు. కొడవలి కూడా తయారు చేసుకొంటున్నాడు.

అదే కాలంలో కొందరు శ్రేష్ఠమైన గొడ్డళ్ళు తయారు చేయడం మొదలెట్టారు. పిల్లలు వాళ్ళను మెచ్చుకొంటూ అడిగేవాళ్ళు. 'తాతా, మాకూ ఒక గొడ్డలి చేసిపెట్టు'. పాపం ఆ తాత యెంతమందికి గొడ్డళ్ళు చేసిపెట్టగలడు? అతడూ పొలంలో పనిచేసుకోవలసి వుంది గదా? అప్పుడు అందరూ అన్నారు. 'తాతా, నీవు గొడ్డళ్ళు తయారు చేస్తూ వుండు. మేము నీకు మా ధాన్యంలో నుంచి కొంత ధాన్యం ఇస్తాం' అంతే ఇక ఆ కమ్మరితాతకు పొలం దున్నవలసిన అవసరం లేదు. ఇంటి దగ్గరే కూర్చొని గొడ్డళ్ళు తయారు చేసేవాడు. ధాన్యం గానీ, వేట జంతువులోని భాగంగానీ తాను ఇల్లు కదలకుండా ఇంటికి చేరేవి. మట్టి పాత్రలూ, ఇంకా అనేక ఇతర వస్తువులూ ఇంటింటా తయారవుతూ వున్నాయి. మున్నీకి చాలా సంతోషంగా వుంది. ఆమె అన్న కోతికీ, ఎలుగుబంటికీ యెంతో బాగా రంగువేసి యిచ్చాడు. మున్నీ స్నేహితురాండ్రు కూడా అటువంటి బొమ్మలు కావాలన్నారు. మున్నా వాళ్ళకు కూడా అలాగే చేసిపెట్టాడు.

ఏనుగుతో స్నేహం

రాగి యుగపు మనుషులకు గ్రామం ఉండేది. చుట్టుపక్కల వాళ్ళ పొలాలు కూడా ఉండేవి. వర్షాకాలంలో పైరు పచ్చగా వుండేది. దాన్ని యెంత శ్రమపడి పెంచారో! అయితే అప్పుడు పొలాలు కొద్దిగా వుండేవి. అడవి యెక్కువగా ఉండేది. అడవి ఆవులూ, తేళ్ళూ పగలు రావడానికి భయపడేవి. రాత్రిపూట వచ్చి పడేవి. మనుషులు కాగడాలు వెలిగించి వాటిని భయపెట్టేవాళ్ళు. మనుషులు రాత్రంతా యెలా మేల్కొని వుండగలరు! పైగా అడవిలో ఏనుగులు కూడా ఉన్నాయి. అవి ఒంటరిగా కాకుండా పాతిక, ముప్పై ఏనుగులు ఒక గుంపుగా పొలంమీద వచ్చి పడేవి. నిప్పుని చూస్తే మాత్రం పారిపోయేవి. కాని వాటి దగ్గరకు వెళ్ళడం చాలా ప్రమాదకరమైన విషయం. ఒకసారి మున్నా గ్రామం వాళ్ళు ఏనుగులతో విసిగిపోయి అవి పొలానికి వచ్చే దారిలో గుంట తవ్వేశారు. పైన మట్టి, గడ్డివేసి కప్పారు. అక్కడ గుంట వున్నట్లు తెలియకుండా చేశారు. ఏనుగులు వచ్చాయి. గ్రామమంతా కాగడాలు వెలిగించారు. మనుషులు డోళ్ళు వాయిస్తూ గోల చేస్తూ బయలుదేరారు. ఏనుగులు మరోవైపు పరుగు తీశాయి. కాని ఆ వైపు నుంచి కూడా మనుషులు యెదురయ్యారు. అయితే ఏనుగులు

చాలా తెలివైనవి. అన్నీ గుంటలో పడకుండానే తప్పించుకుపోయాయి. ఓ చిన్న గున్నఏనుగు మాత్రం గుంటలో పడిపోయింది. ఏనుగులు భయంతో అక్కడ నిలబడలేకపోయాయి. ఆ జనం ఆవుపాలు తాగించి దానిని లావెక్కించారు. ఒక కుండలో పాలు పోసి వుంచేవాళ్ళు. ఆ గున్న ఏనుగు తొండం అందులోవేసి పాలు తొండంతో నింపుకొని మళ్ళీ నోట్లో గుమ్మరించుకొనేది. ఒకరోజు ఆ తెల్లని పాలు చూసి మున్నీకి నోరూరింది. ఆ పిల్ల పరుగెత్తుకుంటూ గున్న ఏనుగు దగ్గరకు వెళ్ళింది. ఆ ఏనుగు గున్న మనుషుల పిల్లలతోనూ, ఆవు దూడలతో కూడా బాగా ఆడుకొనేది. అంచేతనే రెండేళ్ళదైన మున్నీ దాని దగ్గరకు వెళ్ళింది. గున్నఏనుగు అప్పుడే తొండాన్ని పాలలో వేసింది. మున్నీ అన్నది, 'ఏయ్, అన్నీ తాగవద్దు. నాకు కూడా ఇవ్వు.' అదేం చేసిందో తెలుసా? తన తొండాన్ని మున్నీ నోట్లో పెట్టింది. మున్నీ కూడా నోరు తెరిచింది. చాలా మొండి అమ్మాయి. గటగట తాగుతూ వుంది. చిన్నపొట్ట గదా! ఎన్ని పాలు తాగుతూంది? నోరు ఇవతలకు తీసుకొంటూ అన్నది 'ఇక వద్దు, నీవు తాగు'. ఏనుగుగున్న అప్పటికీ ఇంకా తన తొండాన్ని తననోట్లో వేసుకోవడం లేదు. ఆ తరువాత మున్నీకి ఏనుగుగున్నకు చాలా స్నేహం ఏర్పడింది. మున్నీ అమ్మతో పోట్లాడి కుండలో పాలు పోయించేది. తరువాత పిలిచేది. 'మున్నూ, వచ్చేసేయ్, పాలు తాగు? ఆమె స్వరం వినగానే గున్న ఏనుగు తొండం పైకెత్తుకొని ఘీంకరిస్తూ, పరుగుతీస్తూ మున్నీ దగ్గరకు వచ్చేసేది. మున్నీ కుక్కకు ఈ విషయం నచ్చలేదు. అయితే ఎంత చిన్నదైనా అది ఏనుగు గదా? భయంతో దూరంగా పారిపోయేది. చాలా రోజుల వరకు మున్నీ తొండంతో పాలు తాగుతూ ఉంది. పెద్దది కావడంతోనే ఏనుగు పాలు తాగడం మానేసింది. మున్నీకి ఇంట్లో పాలు రుచించడం లేదు. ఏనుగు గున్న మున్నీని తన వీపుమీద కూర్చోబెట్టుకొని, ఆడవిలోని చెట్ల దగ్గరకు తీసుకుపోయేది. మున్నీ పండిన పండ్లను తినేది. మనిషి ఇంకా తోటవేసి పెంచడంలేదు. అడవిలోని చెట్ల పండ్లనే అతడు పోగుచేసుకొంటున్నాడు. ఆ ఏనుగు చాలాకాలం వరకు జీవించింది. ఏనుగుకు యుక్త వయసు వచ్చునప్పటికి మున్నీ ముసలి అవ్వ అయిపోయింది. అది చాలా గొప్ప రాజా ఏనుగు అయ్యింది. అది అందరికీ ప్రియమైనదిగా ఉండేది.

చేప ఆహారమయింది

రాగి యుగపు ఆ మున్నా చాలా తెలివైనవాడు. ఒకరోజు మున్నా – మున్నీ (మున్నీ చిన్నది. ఎంత చెప్పినా మున్నాను విడిచి పెట్టడం లేదు). చాలామంది పిల్లలతో బాటు పొలాలకు కాపలా కాయడానికి వెళ్ళారు. అడవి ఎక్కువగా ఉంది. జంతువులు వచ్చి పొలాలు మేసిపోతూ వుండేవి. ఆ కాలం అమెరికా నుంచి మొక్కజొన్నపంట ఇంకా ఇండియాకి రాలేదు. వచ్చి వున్నట్టయితే మొక్కజొన్న కండెలను కాల్చుకు తినేవాళ్ళు. కాని పొలంలోకి వెళ్ళగానే యెవరో అన్నారు. 'ఈ చెరువులో నీళ్ళు కొద్దిగానే వున్నాయి. ఎన్ని చేపలు కదులుతున్నాయో చూద్దాం.' వెంటనే మున్నీ అన్నది, 'అడ్డుకట్ట వేసి నీటిని అవతలివైపుకు ముందుకు చిమ్మగూడదూ? అప్పుడు చేపలు ఎలా వుంటాయి?'

'ఎండు కట్టెలు కూడా చాలా వున్నాయి' అంటూ పిల్లలు కూడా తోడయ్యారు.

మొదట మట్టివేసి నీళ్ళలో గట్టు పెట్టారు. వాళ్ళ దగ్గర రాగిపార ఉంది గదా! అంచేత మట్టి తవ్వడం ఎంతోసేపు పట్టడంలేదు. రాతి యుగంలో అయితే ఈ పనికే చాలా సమయం పట్టేది. తరువాత అక్కడక్కడ మిగిలిన నీళ్ళను చేతులతో రెండోవైపుకు చిమ్మేవారు. వట్టి బురద మాత్రం ఉండిపోయింది.

కొన్ని చేపలకు బురదలో దూరిపోవడం తెలుసు. అటువంటివి అలా దూరిపోయాయి. కొన్నిటికి తెలియదు. అవి పైనే తన్నుకుంటూ ఉండిపోయాయి. పిల్లలు ముందు వీటినే పట్టుకొని గుంటలో వేశారు. ఇన్ని చేపలని చూసేసరికి పిల్లలందరికీ ఆకలి వేసింది. మున్నా అన్నాడు, "ఒరేయ్ అబ్బాయిలూ, చెప్పండిరా! ఇద్దరు ముగ్గురు పిల్లలం నిప్పుల మీద చేపలను కాల్చి మీకు అందిస్తాము. ఏమంటారు?' అందరూ అన్నారు, 'ఆహా మున్నా, యెంత బాగా చెప్పావురా!'

మున్నీ కూడా మున్నా వెంట వెళ్ళింది. మరో ఇద్దరు పిల్లవాళ్ళు కూడా వెళ్ళారు. ఒక పిల్లవాడు నిప్పు తీసికొని రావడానికి గ్రామంలోకి పరుగెత్తాడు. ఇక మిగిలిన పిల్లలు బురదలో దూరిన చేపలను పట్టుకోవడం మొదలెట్టారు. బురద మధ్య చేపలు చాలాసేపు తన్నుకుంటాయి. కాని త్వరగా చేతికి చిక్కుతాయి. సింహం చేపలు, మట్టగిడసలూ, బొచ్చె చేపలు కూడా ఉన్నాయి. వాటి ముళ్ళు చాలా పదునుగా ఉంటాయి. చేతులకు తగలడంతోనే రక్తం కారిపోతుంది. వాటిని పట్టుకోవడం తెలిసిన పెద్ద పిల్లలు ఇద్దరే వున్నారు. వాళ్ళు కూడా కొన్నిటిని తమ లావుపాటికర్రతో చంపేస్తున్నారు. కొన్నిటిని పట్టుకునే వాళ్ళు. మున్నా స్నేహితులు చేపలను కాల్చి, పనిచేసే పిల్లవాళ్ళ నోటికందిస్తూ తినిపిస్తున్నారు. చేతుల మట్టి కడుగుకొనడానికి వాళ్ళు యెక్కడికి వెళతారు? చెప్పగా చెప్పగా తినిపించే పిల్లలు కూడా అందులోంచి ఓ ముక్కను కొరుక్కొనే వాళ్ళు. చేపలని చాలాబాగా కాల్చారు. ఎండ్రకాయలు కూడా వున్నాయి. నీళ్ళల్లో ఉడికేస్తే ఇంత రుచిగా ఉండనే ఉండవు. గ్రామం యెంతో దూరంలేదు. నిప్పు తీసుకుని రావడానికి గ్రామంలోకి వెళ్ళిన పిల్లవాడు గ్రామస్తులకు చేప సంగతి చెప్పి వచ్చాడు. అంచేత గ్రామంలో వున్న అమ్మలూ, పిన్నమ్మలూ, అవ్వలూ, అందరూ అక్కడకు చేరుకున్నారు. వాళ్ళను చూసి పిల్లలు చాలా సంతోషించారు. అందరూ అన్నారు 'ఈరోజు మేం పిల్లలం అందరం కలిసి చేపలు కాల్చి మీ అందరిచేత తినిపిస్తాం'.

చేపలు చాలా వున్నాయి. అప్పుడు పిల్లలు వాటిని కాల్చి వచ్చిన వాళ్ళకు తినిపిస్తూ వున్నారు.

జీవితం

రాగియుగంలో మనిషి పొలంలో విత్తనాలు చల్లడం ప్రారంభించాడు. అయితే మొదట్లో నాగలితో దున్నడం తెలియదు. మొన గలిగినటువంటి చిన్నచిన్న రాగి ఆయుధాలతోనూ, కర్రలతోనూ భూమిని తవ్వేవాళ్ళు. విత్తనాలు చిమ్మేవాళ్ళు. గింజలు మొలిచేవి. సకాలంలో వర్షాలు పడితే పైరు పండేది. లేకపోతే యెండిపోయేది. కేవలం ధాన్యంమీద ఆధారపడి వుంటే ఆకలితో మాడి చచ్చేవాళ్ళు. ఇప్పుడే ఆవులను, యెద్దులనూ పెంచుతున్నారు. వేటకు వెళ్తే జంతువులు ఒకప్పుడు దొరికేవి. ఒకప్పుడు దొరికేవి కావు. దొరకనప్పుడు ఇంటి జంతువునే చంపుకునేవాళ్ళు. పాలు తాగడం తెలియనే తెలియదు. చైనావాళ్ళు ఇప్పుడిప్పుడే పాలుతాగడం తెలుసుకుంటున్నారు. అదీ పట్టణాలలో. ఆ తాగేవాళ్ళు కూడా పిల్లలూ, రోగులూ, రాగియుగపు మనుషులు చివరకు నాగలితో కూడా పొలం దున్నవచ్చునని తెలుసుకున్నారు. లక్షల సంవత్సరాల నుంచి ఆకులూ, కర్రలూ భూమిలో కుళ్ళుతూ వున్నాయి. అంచేత విత్తనాలు చల్లగానే వెంటనే మొలిచేవి.

పిల్లలు ఆరోజు యెన్నో చేపలు పట్టారు. తాము తినడమే కాకుండా

అందరిచేతా తినిపించారు. వాళ్ళ ఆటల్లోనే ఆహార పదార్థాలు కూడా లభించేవి. ఇంకా మనిషి బిడ్డ వేటాడటం మానలేదు. ఆ కాలంలో కలం లేదు, కాగితం లేదు, పుస్తకం లేదు. మనిషికి అక్షరాలు కూడా తెలియవు. ఇంకేం చదువుతారు! ఏవో కథలు వినేవాళ్ళు. కొన్ని పాటలు జ్ఞాపకం ఉంచుకుని అవి పాడుకుంటూ వుండేవాళ్ళు. మనుషులు చాలా పుష్టిగా ఉండేవాళ్ళు. పసుపు వర్ణపు కిరాతులు ఉత్తర భాగంలో ఉండేవాళ్ళు. అప్పుడప్పుడే వేట స్థలాల కోసం రెండు జాతులూ పోట్లాడుకొనేవి. చాలా హింసాకాండ జరిగేది. పిల్లలను కూడా విడిచి పెట్టేవాళ్ళు కాదు. అయితే యెక్కువగా పోట్లాడుకోవలసిన అవసరం వచ్చేది కాదు. ఆ కాలంలో మనుషులు చాలా తక్కువగా ఉండేవాళ్ళు. అడవులూ, భూములూ యెక్కువగా ఉండేవి.

ఆ కాలంలో వేటతోనూ, వ్యవసాయంతోనూ మనిషి జీవనం గడిచిపోతూ ఉండేది. ఇళ్ళకోసం గుడిసెలు వేసుకునేవాళ్ళు. చలికాలం బట్టలు గానీ, ఆకులూ, బెరడులూ కానీ ధరించేవాళ్ళు. పూర్వం రాతియుగంలో అందరూ కలిసి వుండేవాళ్ళు. కలిసి పనిచేసే వాళ్ళు. కలిసి తినేవాళ్ళు, ఉంటే అందరూ తినేవాళ్ళు, లేనప్పుడు అందరూ పస్తుండేవాళ్ళు. ఒకడు తింటూ ఒకడు పస్తుండటం జరిగేది కాదు. ఇప్పుడు రాగి యుగంలో అందరూ వేరువేరుగా ఉంటున్నారు. వేరు వేరుగా గుడిసెలు వేసుకునే వాళ్ళు. తమ తమ పిల్లాజెల్లాతో వుండేవాళ్ళు. ఎవరి సంపాదన వాళ్ళది. ఎవరి తిండి వాళ్ళది. ఎవడి దగ్గరైనా ఆహారం ఎక్కువగా ఉంటే ఇతరులకు కూడా పెట్టేవాడు. కాని, 'నేను నీకు తిండి పెడుతున్నాను. నీవు నా పని చేయాలి' అని చెప్పేవాడు. పొట్టకోసం మనిషి యేం చేస్తాడు – 'సరే' నంటాడు. పొట్టకోసమే ఇప్పుడు మనుషులు ఉద్యోగులుగానూ, ఉద్యోగినులుగానూ తయారయ్యారు. ప్రజలు వాళ్ళను చిన్నచూపు చూస్తున్నారు. పరస్పరం బేధభావం చూపుకుంటున్నారు. మనుషులు బీదవాళ్ళూ వున్నారు. గొప్పవాళ్ళూ వున్నారు. యజమానులూ వున్నారు. నౌకర్లూ వున్నారు. యజమానికి కోపంవస్తే నౌకరును చితకకొట్టేవాడు. ఈనాడు కన్పించే యజమానులూ, నౌకర్లూ ఈ కాలంలో పుట్టినవాళ్ళే. రాతి యుగంలో మనిషి

కోతిలాగానే వున్నాడు. అయితే ఆ కాలంలో ఒకడు యజమానిగానూ, ఒకడు నౌకరుగానూ ఉండేవాళ్ళు కాదు. బాబులూ, దొరలూ యెవరూ ఉండేవాళ్ళు కాదు. అందరూ తమ చేతులతో పనిచేస్తూ వుండేవాళ్ళు.

ఏనుగుల ముట్టడి

రాగియుగపు మున్నీ ఒకసారి చాలా ప్రమాదంలో చిక్కు కొన్నది. ఒకసారి ఆమె నేరేడు పళ్ళుతినే సమయంలో అనేకమంది ఇతర పిల్లలతో కలిసి ఆడవిలో చాలా దూరం వెళ్ళిపోయింది. అందరిచేతుల్లోనూ విల్లు, బాణాలున్నాయి. అందరికీ చెట్లెక్కడం తెలుసు. నది ఒడ్డున నేరేడు చెట్లు గుంపులు గుంపులుగా వున్నాయి. అవి అడవి నేరేడు చెట్లు. మనిషి తోటలు వేసి పెంచడం లేదు. చెట్లనిండా నల్లని నేరేడు కాయలున్నాయి. అవి తినడానికి చాలా తియ్యగా వున్నాయి. అంచేత నల్లని భ్రమరాలు వాటి రుచి చూస్తున్నాయి. కింద నేల మీద కూడా కావలసినన్ని నేరేడుకాయలు పడివున్నాయి. అయినా పిల్లలు చెట్టెక్కకుండా ఊరుకుంటారా? పైకెక్కి కొమ్మలు ఊపారు. గుట్టలు గుట్టలుగా నేరేడుకాయలు తింటూ వున్నారు. చిన్నపిల్లలు కొన్నితింటూ కొన్ని ఒంటికి

పులుముకొంటున్నారు. వేసవికాలం గడిచిపోయి అప్పుడే వర్షాలు పడుతున్నాయి. బట్టల అవసరం వాళ్ళకు లేదు. బుట్టలు మాత్రం దగ్గరే వున్నాయి. ఏవయినా దొరికితే వాటిలో తీసికొని పోతారు.

నేరేడు కాయలు తిని పొట్టలు బాగా నింపుకొన్నారు. ఇంకా చీకటి పడడానికి చాలా సమయం ఉంది. పిల్లలకు ఇంటి తొందరేమీ లేదు. వెదురు బూర వాళ్ళ దగ్గరే వుంది. అందరూ నృత్యం ప్రారంభించారు. నృత్యంతోపాటు గానం కూడా. అదే సమయంలో ఒకడి చూపు కొండవైపుకు మళ్ళింది. ఏవో నల్లని ఆకారాలు కదిలి వస్తున్నట్లుగా కన్పించాయి. వేటగాళ్ళయిన పిల్లల కళ్ళు, ముక్కు, చెవులు చాలా చురుకైనవిగా ఉంటాయి. ఓ పిల్లవాడు అరిచాడు. 'ఒరేయ్! ఏనుగులు, ఇటే వస్తున్నాయి'. పిల్లలు గ్రామం వైపు పరుగెత్తాలంటే గ్రామం చాలా దూరంగా వుంది. మరేం చేయాలి? దగ్గరలో ఓ పెద్ద మర్రిచెట్టు వుంది. అందరికన్నా పెద్దవాడుగా వున్న ఓ పిల్లవాడు అన్నాడు. 'ఆ మర్రిచెట్టు మీదికి ఎక్కే సేయండి. అతడు చిన్న పిల్లలను యెక్కిస్తూ వున్నాడు. పిల్లలందరూ చాలా పైకివెళ్ళి కొమ్మలమీద కూర్చున్నారు. పెద్దపిల్లలు భయపడేవాళ్ళు కాదు. కాని చిన్న పిల్లలు వణికి పోతున్నారు. పెద్దపిల్లలు చిన్నపిల్లలకు ధైర్యం చెప్పారు. ఆ కాలంలో మనిషి అడవి జంతువుల మధ్యే నివసించేవాడు గదా! భయపడితే యెలా? కొంచంసేపటిలో ఏనుగులు కూడా వచ్చేసాయి. అందరి కన్నా పెద్ద పిల్లవాడు ఒంట్లు పదివరకే లెక్క పెట్టగలడు. అతడు ఏనుగులను లెక్క పెట్టాడు. ఒకటి గాదు, రెండు గాదు, పది! 'ఓహో! ఇంకా యెక్కువే ఉన్నాయి. వాటిలో పెద్దవీ వున్నాయి. చిన్నవీ వున్నాయి. ఒక రాజాలాంటి ఏనుగు ఒక కొండ మాదిరిగానే కన్పిస్తూ ఉంది. ఏనుగులన్నీ తొండాలు పైకెత్తుకుని 'క్యాం – క్యాం' అంటూ ఘీంకరిస్తున్నాయి. పెద్ద పిల్లవాడు నెమ్మదిగా అన్నాడు. 'తొండమే వీటికి ముక్కు. తొండంతోనే నీళ్ళు తాగుతాయి. తొండం లేకపోతే ఏనుగులు తిండి తినలేవు. నీళ్ళు తాగలేవు. పడుకున్నా కూడా అవి నోటితో నేలమీది వస్తువులు అందుకోలేవు'. ఏనుగులు వాసనచూసి అది మర్రిచెట్టు అని తెలుసుకున్నాయి. దానిమీద చాలా మంది మనుషుల పిల్లలు కూర్చుని వున్నారు. మనిషి ఏనుగులకు

శత్రువు'. " వీళ్ళు శత్రువుల పిల్లలు. వీళ్ళను ప్రాణాలతో విడువకూడదు" అని ఏనుగులు అనుకొన్నాయి. కాని తొండం ఆ పిల్లలను అందుకోలేక పోతున్నది. అందినవరకు చిన్న కొమ్మలను విరిచేశాయి. చెట్లను గుద్దాయి. కాని చెట్టు ఒక్కసారివూగి అలాగే నిలబడిపోయింది. అవి పిల్లలవైపు చూస్తూ వున్నాయి. పిల్లలు ఏనుగులవైపు చూస్తూ వున్నారు. తొండాన్ని యెంత పైకెత్తినా పిల్లలు అందడం లేదు. వాటి ఘీంకారం భయంకరంగా వుంది. అయితే పిల్లలు కూడా ఇంకా సగం అడవి మనుషులే కదా! వాళ్ళు భయపడేవాళ్ళు కాదు. వాళ్ళు సంతోషంగా చెట్టు కొమ్మల మీద కూర్చుని వున్నారు. ఆకలయితే వాళ్ళదగ్గర కావలసినన్ని నేరేడు కాయలున్నాయి. పిల్లలు నేరేడు కాయలుతిని గింజల్ని అన్నిటికన్నా పెద్దదైన ఏనుగు మీదికి విసురుతున్నారు. దానితో పెద్ద ఏనుగు మరింతగా మండిపడుతూ వుంది. అది చెట్టును మరో గుద్దు గుద్దింది. చెట్టు కొంచెం వూగింది. అంతే! కొంతసేపటికి చిన్నదైన మున్నీ కూడా కొంటెదై పోయింది. ఆమె కూడా ఏనుగు మీదికి నేరేడు గింజలు విసురుతూ వుంది. అరుస్తూ దాన్ని ఉడికిస్తూ ఉంది.

కొంతసేపటికి సూర్యుడు అస్తమించబోతూ వున్నాడు. అటువైపు ఆకాశం ఎర్రగా కావురేసింది. మబ్బులు తక్కువగానే వున్నాయి. ఆ మబ్బులు నారింజరంగును పులుముకుంటున్నాయి. కాని ఏనుగులు కదలలేదు. పెద్ద సర్దారు కొడుకు అన్నాడు, 'సరే వుండండి, ఇక్కడే వుండండి. మేము ఆకలితో చచ్చిపోయే వాళ్ళం కాదు. కాని మీకు ఆకలి చావు తప్పదు. మీ బాలగోపాలురు తొండంతో పాలు తాగుతున్నారు గదూ! వాళ్ళనైనా ఆకలి తీర్చుకోనివ్వండి.

చీకటి పడింది. కాని ఏనుగులు ఇంకా అక్కడే తిష్టవేసి వున్నాయి. పిల్లలు కూడా ఇంటికి వెళ్ళడానికి తొందరపడుతున్నారు. వాళ్ళు ఆకలితో లేరు. కాని రాత్రంతా ఆకలితో వుండగలరా! పైగా నిద్రవస్తుంది. నిద్రమగతలో ఎవరైనా కాలుజారి కిందపడవచ్చు. అప్పుడు ఇంకేముంది. ఏనుగులు విడిచిపెడతాయా? తొండంతో పైకెత్తి కాళ్ళకింద వేసుకొని నలగదొక్కుతాయి.

ఆ సగం అడవి మనుషులు బుట్టలతో పాటు తాళ్ళు కూడా తెచ్చుకున్నారు.

ముందు చిన్న పిల్లలను కొమ్మలకంటగట్టారు. తరువాత యెవరికి వాళ్ళు కొమ్మలకు అంటగట్టుకున్నారు. ఇప్పుడందరూ నిశ్చింతగా వున్నారు. ఓ గడియరాత్రి గడిచింది. రెండు గడియలు గడిచాయి. కొందరికి కళ్ళు మూతలు పడుతున్నాయి. చిన్న చిన్న ఏనుగుగున్నలు కూడా నేలమీద పడుకున్నాయి. వాటికి మాట్లాడడం వస్తే చెప్పేవి – ' ఈ పిల్లలను పోనివ్వండి. పాపం వాళ్ళు మనకేం హాని చేశారు?'

పిల్లలు ఆలోచిస్తూ వున్నారు. ఏనుగులు ఈ రాత్రంతా మనల్ని విడిచి పెట్టి వెళ్ళవు. మూడో గడియ గడిచిన తరవాత చూశారు. ఏనుగులు తొండాలు పైకెత్తుకొని గ్రామంవైపుగా చూస్తూ వున్నాయి. అన్నీ లేచి నిలబడ్డాయి. గందరగోళ పడుతున్నాయి. పిల్లలకు కూడా మనుషుల గోల వినిపిస్తూ వుంది. ఏనుగుల వైపుగా ఆకులు చిక్కగా ఉండడంచేత అందరికీ కన్పించడం లేదు. కొందరికి మాత్రమే దూరంగా వెలుతురు కన్పిస్తూ వుంది. తమ పిల్లలను వెదకడానికి గ్రామంలోని తల్లిదండ్రులు బయలుదేరారు. ఏనుగులు భయపడి పోయాయి. మనిషికి ఎందుకు భయపడతాయి. 'ఇంకా అతడి దగ్గర మామూలు రాగి ఆయుధాలే గదా ఉన్నాయి. అయితే నిప్పు ఇప్పుడు మనిషికి తోడయ్యింది. నిప్పుకి అన్ని జంతువులూ భయపడుతున్నాయి. నిజంగా అదే జరిగింది. ఏనుగులన్నీ చావు తప్పించుకొని పారిపోయాయి.

బానిస విధానం

రాగియుగంలోని మనిషి రాగి కత్తితో చాలా బలవంతుడయ్యాడు. కాని ఆ కాలంలోనే స్త్రీ ప్రాధాన్యతను కోల్పోయింది. అన్ని విషయాలలోనూ పురుషుడు తనను గొప్పవాడుగా భావిస్తున్నాడు. బయట సంపాదించే పనిని పురుషుడు చేస్తున్నాడు. అతడే గోవులనూ, గొర్రెలనూ మేపుతున్నాడు. అతడే పొలం దున్నుతున్నాడు. అయితే మరో చెడ్డపని కూడా జరిగింది. పురుషులు, స్త్రీలు సంతలో పశువుల్లాగా అమ్మబడుతున్నారు. (బానిస విధానం ప్రారంభం) మొదట్లో రెండు బృందాల మధ్య ఎప్పుడైనా కలహం వస్తే వాళ్ళు ఒకరినొకరు

చంపుకునేవాళ్ళు. వేటాడటం, చేపలు పట్టడం, అడవి నుంచి పండ్లు తుంచుకు రావడం వాళ్ళ పని. వాళ్ళు అన్ని పనులూ చేసేవాళ్ళు. ఇతరచోట్ల వుండే మనుషులను పిలిస్తే వాళ్ళకు తిండి పెట్టాలి గదా! ఇప్పుడు మనిషి మనుషులను తినడం మానేశాడు.

వ్యవసాయం చేయడం ప్రారంభించిన తరువాత పొలాల్లో యెక్కువ పని చేయవలసి వచ్చేది. పశువుల పెంపకం మొదలు పెట్టిన తరువాత అందులో కూడా పని పెరిగిపోయింది. ఇప్పుడు యుద్ధాలు జరిగితే స్త్రీలనూ పురుషులను బంధించి తీసుకువచ్చి వాళ్ళచేతకూడా చాకిరి చేయించుకోవడం మొదలు పెట్టారు. ఆవులచేత, ఎద్దులచేత చేయించుకొన్నట్లుగా, జయించి తీసుకొచ్చి పనిలో పెట్టిన వాళ్ళను దాసులనీ, దాసీలనీ పిలిచేవాళ్ళు. వాళ్ళను పశువులను బాదినట్లు కర్రలతో బాదేవాళ్ళు. వాళ్ళకు హీనమైన తిండీ, హీనమైన గుడ్డా ఇచ్చేవాళ్ళు. ఒకసారి ఇంటి యజమానురాలు ఆవు దగ్గర కూర్చొని పాలు పితుకుతూ వుంది. ఆవు కొంచెం గొప్పది. దాసీతో ఆ యజమానురాలు అన్నది. 'ఒసేయ్‌కాళీ, ఏమిటే చూస్తూ నిలబడ్డావు? కొంచెం నీ వీపును వంచి నాకు పీటగా వుంచు. కాళీ ఆమెకు పీటగా వీపు వంచింది. యజమానురాలు యెత్తుపీట మీద కూర్చున్నట్లుగా ఆమె వీపుమీద కూర్చొని పాలు పితుకుతూ వుంది. దాసీ

వుండగా ఆమె స్వయంగా పాలు పితుకుతూ వుంది. ఎంచేత? ఎంచేతనంటే దాసదాసీలు, వాళ్ళ పిల్లలూ, యజమానులకు పశువులూ, దూడలు లాంటివాళ్ళు. యజమాని అనేవాడు 'ఇన్ని దూడలు మనకు అవసరం లేదు'. అంతే వాళ్ళను తీసుకుపోయి సంతలో అమ్మేసేవాళ్ళు. ఆ కాలంలో దాసదాసీల సంతలు జరుగుతూ వుండేవి. తల్లి లబోదిబోమని రోదిస్తూ వుంటుంది. ఆమె బిడ్డలను బలవంతంగా గుంజుకొని వెళ్ళి సంతలో అమ్ముకొనేవాళ్ళు. రాగియుగంలోనూ బానిసలు అమ్మబడుతూ వుండేవాళ్ళు.

బానిసలు దెబ్బలకు భయపడి గొడ్డు చాకిరి చేసేవాళ్ళు. చీకటి ముఖాన లేచి పనిలో ప్రవేశించే వాళ్ళు. అర్ధరాత్రి వరకు ఆవలించడానికి కూడా తీరిక వుండేది కాదు. ఏ యజమానురాలికైనా దయాదాక్షిణ్యాలు వుంటే ఆమె దాసదాసీలను కొంచెం కనికరించేది. బానిసలను ధనికులే ఉంచుకొనేవాళ్ళు. రాతియుగంలో ధనికులూ పేదలూ అంటూ ఉండేవాళ్ళు కాదు. అడవిలో దొరికే ఆహార పదార్థాలు అందరూ కలిసి పోగుచేసుకునేవాళ్ళు. అందరూ కలిసి తినేవాళ్ళు. కాని రాగియుగంలో అందరూ వేరువేరుగా వుంటున్నారు. తమ వస్తువులను వేరుగా వుంచుకొంటున్నారు. ఇప్పుడు కొందరు ధనికులైపోతున్నారు. కొందరు పేదలై పోతున్నారు. బానిసలను పెట్టుకొని ధనికులు వాళ్ళ శ్రమతో మరింత ధనికులై పోతున్నారు.

మనసులోని దొంగ

రాగియుగం రెండు, రెండున్నర వేల సంవత్సరాలకు పైగానే వుంది. ఆ యుగంలోనే మనిషి లెక్కబెట్టడం నేర్చుకున్నాడు. అక్షరాలు మాత్రం లేవు. మున్నా చిన్నవాడు, మున్నీ పెద్దది. మున్నీ తల్లిదండ్రుల మాట వినేది. కాని మున్నా వినేవాడు కాదు. అయితే అందులో మున్నా దోషం కూడా లేదు.

మున్నా మాత్రం మాట వినడంలేదు. ఈ సంగతి అందరికీ తెలిసిపోయింది. మున్నా మనసులో ఒకడు కాదు ఇద్దరు మున్నాలు వున్నారు. ఇద్దరి దేహం ఒకటేగాని మనసులు మాత్రం రెండు. తల్లిదండ్రులు యేదైనా పనిచేయమని చెప్పినప్పుడు బద్మాష్ మున్నీ ముందుగానే అనేవాడు, 'నేను చేయను, ఈ పని చేయను'. పాపం మున్నా నచ్చజెప్పేది. కాని మనసులో దూరివున్న ఆ సైతాన్ మున్నా మాట వినేవాడు కాదు. మున్నా ఒకరోజు తండ్రిమాట వినకుండా ఆయనకు కోపం తెప్పించాడు.

ఆ కాలంలో కోపం వచ్చినప్పుడు తల్లిదండ్రులు బాగా కొట్టేవాళ్ళు. మున్నాకు దెబ్బలు తిన్నందుకు అంత దుఃఖం కలుగలేదు. అతడి అక్క వీపు నిమురుతూ బుజ్జగించింది. తమ్ముణ్ణి ముద్దు పెట్టుకొన్నది. ఆమె అన్నది, 'తమ్ముడూ, నీవు అలా యెందుకు చేస్తున్నావు? మున్నా ఆమెను కౌగలించుకొని చెప్పాడు, 'అక్కా, నా మనసులో ఇద్దరు మనుషులు జొరబడ్డారు. ఒకడు మంచివాడు. అతడంటూ వుంటాడు 'అమ్మా, బాబూ మనల్ని ఎంతగా ప్రేమిస్తున్నారోచూడు! మనమేలు వాళ్ళు కోరినంతగా మరెవరు కోరతారు? వాళ్ళు మనకు చేసినంత మేలు మరెవరు చేస్తారు? కాని అక్కడ మరో దొంగ కూడా జొరబడి వున్నాడు కదా! వాడు మాట వినవద్దని చెపుతూ వుంటాడు. అంతే, నేను అమ్మా, బాబు మాట వినలేకపోతున్నాను'.

మున్నీ అన్నది, 'దొంగవాడి మాట వినకూడదు. అమ్మ చెప్పిన పని వెంటనే చేయాలి. 'మున్నా అన్నాడు. 'చెప్పిన పనిచేస్తే వాడి మాటకు విలువ లేకుండా పోతుంది. మరి నీలోకూడా ఇద్దరు వున్నారా?" "అవును, నాలో కూడా, అందరిలోనూ రెండు మనసులుంటాయి. దొంగమనసు మాట ఎన్నడూ

వినకూడదు. తల్లిదండ్రుల మాట వినినీయకుండా చేసేవాడే దొంగ. నిద్రలేచి ఇంకా మంచం వదలవద్దని చెప్పేవాడే దొంగ. ఆ దొంగమాట వింటూ వుంటే మనిషి పనియేది పూర్తికాదు".

ఆ రోజు మున్నాకు ఈ విషయం తెలిసింది. మనసులో ఒకటి కాదు, రెండు మనసులు ఉన్నాయని అతడు కూడా ఆలోచిస్తూనే వుండేవాడు. ఇప్పుడతడు దొంగ మనసును కనిపెట్టి వుంటున్నాడు. అమ్మ 'కొంచెం గడ్డి కోసుకురా' అన్నది. దొంగమనసు వెంటనే 'చేయవద్దు' అని చెవిలో ఊదింది. మున్నా అన్నాడు, 'అమ్మ మాట యెందుకు వినకూడదు?'

'గడ్డి కోయడానికి యెందుకు పోతావు? అది చాలా కష్టమైన పని'.
మున్నా ఖచ్చితంగా చెప్పేశాడు. 'నేను అమ్మ మాట కాదనను'.
అంతే, మనసులోని దొంగ అణిగిపోయాడు.

వ్యాపారం

రాతియుగంలో నలుపురంగు – పసుపురంగు జాతులకు యుద్ధాలు జరిగాయి. ఆ తరువాత యుద్ధాలు జరగలేదని కాదు. అయితే రెండు జాతుల వాళ్ళు యెవరికి వాళ్ళు తప్పుకొని వుంటున్నారు. తరువాత మరో జాతి (ఆర్యజాతి) మనుషులు వచ్చేశారు. వీళ్ళు పసుపురంగు వాళ్ళూ కాదు, మరీ అంత నలుపురంగు వాళ్ళూ కాదు. వీళ్ళు చామనఛాయగా వుండేవాళ్ళు. వీళ్ళల్లో మరో ప్రత్యేకత వుంది. వీళ్ళు రాగితో అన్ని రకాల ఆయుధాలు తయారు చేస్తుండేవాళ్ళు. గంగానదిలోనే కాకుండా వీళ్ళు సముద్రంలో కూడా ఓడలు నడుపుతూ ఉండేవాళ్ళు. అయితే అవి ఇనుప ఓడలు కాదు. ఇనుప ఓడలు నడపడం ఇంకా వాళ్ళు తెలుసుకోలేదు. కొయ్యవే పెద్ద పెద్ద ఓడలు, వాటికి తెరచాపలెత్తేవాళ్ళు. గాలి వాటిని వేగంగా గుంజుకు పోయేది. వీళ్ళు యుద్ధాలు చేయడంలో చురుకైన వాళ్ళు. లేప్చాజాతిలోని తండ్రులు, తాతలు (కిరాతులు) కూడా గొప్ప యోధులే. నలుపురంగు వాళ్ళైన నిషాదులు కూడా తక్కువైన వాళ్ళేమికాదు. కాని ఈ చామనఛాయ మనుషులు వాళ్ళందరిలో చాలా చురుకైన వాళ్ళు. అనేక రకాల వస్త్రాలు తయారుచేసేవాళ్ళు. చాలాబాగా వ్యవసాయం

చేసేవాళ్ళు. ఆవులు, యెద్దులు పెంచుతూ వుండేవాళ్ళు. ఎద్దులను తమ రథాలకు కట్టి పరుగెత్తించే వాళ్ళు. వాళ్ళు గ్రామాలు కాదు, పట్టణాలు నిర్మించుకొని వుండేవాళ్ళు. ఇటుకతో రెండు, మూడు అంతస్తుల భవనాలు నిర్మించుకొని వాటిలో వుండేవాళ్ళు. అమృత్‌సర్‌కు పశ్చిమంగా, సింధునదీ తీరాన మొదట స్థిరపడ్డారు. తరువాత తూర్పు దిక్కుగా సాగిపోయారు. నదుల తీరాలలో వారి పట్టణాలున్నాయి. పెద్ద పెద్ద పడవలలో ప్రయాణాలు చేస్తూ సరుకులు అమ్మడానికి తీసుకుపోతూ వుండేవాళ్ళు.

ఈ సింధు ప్రాంతం వాళ్ళు సాగిపోతూ బనారన్‌కు చేరుకొన్నారు. అక్కడ కోట కట్టుకున్నారు. దుకాణం తెరిచారు. కిరాతులు, నిషాదులు అడవిలో వేటాడిన జంతువులనూ, పులి చర్మాలనూ, లేడి చర్మాలనూ, తేనెనూ, అడవిలో లభించిన పండ్లనూ, ధాన్యాన్ని కూడా సింధు ప్రాంతం వాళ్ళ దగ్గరకు తీసుకొని పోయేవాళ్ళు. వాళ్ళు వీటిని కొని, తమ వస్తువులు ఇచ్చేవాళ్ళు. ఈ అడవి మనుషులకు యేం తెలుసు! కాని వాళ్ళు చాలాయుక్తిపరులు. అంచేత ఈ సింధు ప్రాంతం వాళ్ళు వీళ్ళ సరుకులను చౌకగా తీసుకునేవాళ్ళు. తమ వస్తువులను ప్రియంగా ఇచ్చేవాళ్ళు. ఆ కారణంగా అప్పుడప్పుడు యుద్ధాలు జరుగుతూ వుండేవి. చాలామంది యుద్ధాలలో చంపబడేవాళ్ళు. కొందరు బానిసలుగా అమ్మబడేవాళ్ళు. క్రమ క్రమంగా సింధు ప్రాంతం నుంచి వచ్చిన వాళ్ళ శక్తి పెరిగిపోయింది.



మిగిలిన వాళ్ళు వాళ్ళకు భయపడుతూ ఉండేవాళ్ళు. సింధు ప్రాంతంవాళ్ళ రాజునే తమ రాజుగా భావించేవాళ్ళు. వాళ్ళు ప్రతి సంవత్సరం ఆయనను చాలా ధనం సమర్పిస్తూ వుండేవాళ్ళు.

పూర్వపు రెండుజాతుల వాళ్ళకూ రాయడం తెలియదు. సింధు ప్రాంతం వాళ్ళకు రాయడం తెలుసు. అక్షరాలులేకపోతే మనం మన బిడ్డలకు ఉత్తరాలు వ్రాసుకోగలిగేవాళ్ళమేనా? పురాతనయుగంలో రైళ్ళు, విమానాలు లేనప్పుడు ప్రజలు యెన్నో నెలలపాటు కాలినడకనే యాత్రలు సాగించేవాళ్ళు. అక్షరాలు లేకపోతే ఈ విధంగా కాలినడకన తిరిగే మనిషితో తండ్రులు మా అమ్మాయితో ఈ విషయం చెప్పమనీ, మా అబ్బాయితో ఈ విషయం చెప్పమనీ చెపుతారనుకోండి. పాపం ఈ పాదయాత్రచేసే మనిషి ఎందరి విషయాలు గుర్తుంచుకోగలడు? ఎన్ని విషయాలు గుర్తుంచుకోగలడు? సింధు ప్రాంతం వాళ్ళు ఆకులమీద, కర్రలమీద ఉత్తరాలు చదవడం చూసి మిగిలినవాళ్ళు ఆశ్చర్యపోతూ వున్నారు. దానిని మాయ మంత్రంగా భావిస్తూ వున్నారు. అయితే చాలా తక్కువగా రాసేవారు. ఇంకా కాగితం లేదు. పలకా, బలపం లేదు. ఒకప్పుడు చర్మం మీద రాస్తే ఒకప్పుడు కర్రమీద రాసేవాళ్ళు.

మనుషుల వ్యాపారం

అయితే పసుపురంగు, నలుపురంగు ఛామనఛాయలో వుండే మూడు జాతుల మనుషులూ నివసిస్తూ వున్నారు. అందరూ ఒకరినొకరు దెబ్బతీయాలనే చూస్తూ వుండేవాళ్ళు. అప్పుడప్పుడు యుద్ధాలు లేని సమయాలలో పరస్పరం నవ్వుకొంటూ మాట్లాడుకొనే వాళ్ళు కూడా. కాని మూడు జాతుల వాళ్ళూ మూడు రకాల భాషలు మాట్లాడేవాళ్ళు. ఒకరి మాట ఒకరికి అర్థం కాదు.

బనారన్ దగ్గర జరిగిన సంగతి. దగ్గరలో ఒక అడవి కూడా వుండేది. అక్కడే ఆడవిలో నిషాదుల గ్రామం ఒకటి వుంది. అనేక పూరి గుడిసెలుండేవి. ఒక్కొక్కప్పుడు ఆ గుడిసెలను కూడా విడిచిపెట్టి మరోచోటుకు వెళ్ళి స్థిరపడేవాళ్ళు. బనారన్‌లో సింధు ప్రాంతం వాళ్ళు ఇటుకలతో కట్టిన భవనాలు వుండేవి. రోడ్లమీద యెద్దుల రథాలు పరుగులు తీస్తూ వుండేవి. అక్కడ వుండే సింధు

వర్తకులు అక్కడక్కడ వర్తకంకోసం తమ నౌకర్లను వుంచారు. అన్నిరకాల వ్యాపారాలు జరుగుతూ వుండేవి. ఒకచోట నిషాద బాలబాలికలు నృత్య గానాలతో ఆటలాడుకొంటూ వున్నారు. నృత్యగానాలలో ఇంటికి వెళ్ళాలనే విషయమే మరచిపోయారు. అదే సమయంలో అడవిలో నుంచి కొందరు మనుషులు వచ్చారు. నృత్యమూ గానమూ ఆగిపోయింది. ఆ మనుషులు పిల్లలను ముట్టడించారు. కత్తులు దూసి బెదిరించారు. "ఏయ్ జాగ్రత్త! అరిచారో, ఈ కత్తి మీ పొట్టలో దిగబడిపోతుంది." అది విని అందరూ స్తబ్ధులైపోయారు. ఆ వచ్చిన మనుషులలో ఒక కుర్రవాడు నిషాద భాషలో అన్నాడు. 'మా ముందు నడుస్తూ పదండి ' వాళ్ళు ఆ పిల్లలను మగహీ (మాగధీ) నది దగ్గరకు తీసుకొని వెళ్ళారు. పిల్లలందరి చేతులు బంధించారు. అక్కడకు ఒక పడవ వచ్చి వుంది. పదహారు మంది బాల బాలికలను ఆ పడవలో కూర్చోబెట్టారు. వాళ్ళను పట్టుకొన్న వాళ్ళు కూడా అందులోనే కూర్చున్నారు. అది వర్షాకాలపు నది. అంచేత ఇప్పుడు నీరు బాగా వుంది. లేకపోతే ఆ చిన్న నదిలో పడవ నడపలేరు. అన్ని పనులూ యెవరికీ తెలియకుండా జరిగిపోయాయి. పిల్లలు యెనిమిది సంవత్సరాల నుంచీ పదహారు సంవత్సరాల వయసులో వున్నవాళ్ళు. పాపం పెద్దగా అరవనైనా అరవలేక పోతున్నారు. ఒక పిల్లవాడు బిగ్గరగా యేడిస్తే అతడి చెవి కోసేశారు. రక్తం ఆగకుండా కారిపోతూవుంది. చీకటిలోనే పడవ చాలా వేగంగా



వెళ్ళిపోయింది. వాళ్ళను పట్టుకొన్న వాళ్ళు పసుపురంగు కిరాత జాతివాళ్ళు. వాళ్ళలో ఒక్కడే నిషాద భాష కొంచెం మాట్లాడగలుగుతున్నాడు. పిల్లలు మౌనం వహించారు. కాని వాళ్ళ కళ్ళు కన్నీళ్ళు కారుస్తూనే వున్నాయి. పిల్లలకు రొట్టెముక్కలూ, కాల్చిన చేపముక్కలూ ఇచ్చారు. కాని భయంతో వాళ్ళ ఆకలి కూడా పారిపోయింది. చిన్నవాడైన మున్నా విలవిలా తన్నుకుంటూ అన్నాడు. 'మామా, మమ్మల్ని అమ్మ దగ్గరకు తీసుకుపో'.

మామా అన్నాడు, 'అక్కడికే పోతున్నామని'. ఇప్పుడు పిల్లలందరూ నవ్వుతూ వున్నారు.

రాత్రిపూటే పడవ మగహీనదిలో నుంచి గంగానదిలోకి వెళ్ళిపోయింది. అక్కడ మరో పెద్ద పడవ ఆగి వుంది. పిల్లల్ని ఆ పెద్ద పడవ మీద యెక్కించారు. కిరాతులు వెళ్ళిపోయారు. ఇప్పుడు పిల్లలను స్వాధీనపరచుకొని వున్న వ్యక్తులు వాళ్ళ భాషే మాట్లాడుతున్నారు. వాళ్ళు చెప్పారు. 'మేము మిమ్మల్ని ఆడవిలో నుంచి బయటకు తీసి పట్టణంలోకి తీసుకుపోతున్నాము.' చివరకు వాళ్ళు ఆ పిల్లలను బనారస్‌లో బానిసలను అమ్మే సంతకు తీసుకొని వెళ్ళారు. అక్కడ వాళ్ళను ఒక చెట్టుక్రింద కూర్చోబెట్టారు. గడియ రెండు గడియల్లో వాళ్ళకు తిండీ తిప్పలూ చూశారు. అప్పుడు చాలమంది సింధు ప్రాంతీయులు వచ్చారు. వాళ్ళు పిల్లలను రాగిముక్కల ధరకు కొన్నారు. ఒకరిద్దరు కొనే మనుషులు



వచ్చారు. బానిసలనందరినీ వాళ్ళు పంచుకుపోయారు. ఆ పిల్లలు మళ్ళీ తమ అమ్మా బాబులను కలుసుకోలేకపోయారు.

కోతితో స్నేహం

రాగియుగపు ఆ మున్నా చాలా నేర్పరితనం గలవాడయ్యాడు. ఆడవిలో కోతులను పట్టుకోడానికి పిల్లలు ఒక ఉచ్చువేసి ఉంచారు. ఉచ్చు చాలా పెద్దది. దాని మధ్యలో ఓ చిన్న గుంట తవ్వి అందులో చాలా గింజలు వేసి ఉంచారు. ఉచ్చుతాడు కొసను చాలాదూరం తీసుకొని వెళ్ళి మున్నా, అతడి స్నేహితులు చాటున కూర్చొని వున్నారు. కోతులు వచ్చి గింజలు చూసేవి. మళ్ళీ వెనక్కు తగ్గేవి. వాటికి నోటిమాట లేదు కాని ఉంటే అనేవి – 'మా వంశానికే చెందిన మనుషులు మమ్మల్ని బొత్తిగా మూర్ఖులుగా భానిస్తున్నారు. పిల్లలు రోజంతా ఎదురు చూస్తూవున్నారు. కాని యే తెలివితక్కువ కోతీ ఉచ్చులో పడలేదు.

మున్నా దిగులు పడలేదు. అతడు మరుసటి రోజు కూడా అక్కడకు వెళ్ళాడు. రెండు ఉచ్చులు పన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా కూర్చున్నారు. మొదటిరోజున కోతులకు పెద్దగా వున్న కోతి ఎగురుతూ భయపెడుతూ ఉండేది. ఏ కోతీ ఆ దగ్గరలోకి వచ్చేది కాదు. ఈ రోజు దానికన్నా గొప్ప కోతి ఒకటి ఎక్కడి నుంచో వచ్చింది. అది పోట్లాడటానికే వచ్చింది. ఇంకేముంది, అది పోట్లాట అనండి, కుస్తీ అనండి, జరిగింది. రెండూ ఒకదాని నొకటి కరుచుకొనేవి. గోళ్ళతో రక్కుకొనేవి. మిగిలిన కోతిపిల్లలూ, కోతులూ భయపడి దూరంగా పోయాయి. పెద్దకోతి తన బృందంలోని కోతులను కూడా ఘోరంగా కొడుతూ వుండేది. అంచేత దానిని ఇష్టపడే కోతి ఒక్కటి కూడా లేకుండా పోయింది.

ఇటు కోతుల కుస్తీ ఆరంభమయింది. అటు నెమ్మదిగా రెండు కోతులు ఉచ్చు దగ్గరకు వచ్చేశాయి. వాటికి ఆ మేత చాలా ఇష్టంగా వుంది. అలా చేయి పెట్టిందో లేదో మున్నా రెండు ఉచ్చులతాడు ఒకేసారి లాగాడు. కాని కొంచెం ఆలస్యంగా, ఓ చిన్నపిల్ల చేయి ఉచ్చులో చిక్కుకొన్నది. రెండోది పారిపోయింది. మున్నా అరిచాడు. కోతులను పారగొట్టాడు. ఆ కోతిపిల్లను కాల్చుకొని తిందామని

ఎవడో అన్నాడు. ఆ కాలంలో అందరు మనుషులూ కోతిని కూడా తినేవాళ్ళు.

మున్నా ఆ కోతిపిల్లను ఒళ్ళో భద్రంగా దాచుకొన్నాడు. అది బతికిపోయింది. మున్నా దానికి పాలు పట్టేవాడు. గింజలు తినిపించేవాడు. నాలుగైదురోజులు ఆ కోతిపిల్ల భయపడుతూ ఉంది. తరువాత ఒళ్ళోకి వచ్చేసింది. మున్నా దానికి అనేక విషయాలు నేర్పాడు. అది కొన్ని మాసాల తరువాత రెండుకాళ్ళ మీద నడవడం ప్రారంభించింది. ఇప్పుడు భుజాన కర్రబెట్టుకొని నడుస్తూ వుంది.

అది మున్నామాట మాత్రమే వింటుంది. ఇతర పిల్లవాళ్ళు దగ్గరకొస్తే పళ్ళు కొరికేది. చెవులు వెనక్కి తిప్పేది. చేతులు, ముఖమూ ఊపుతూ బెదిరించేది. చిన్నపిల్లలు దానికి చాలా భయపడేవాళ్ళు. మున్నా యే పిల్లవాడినైనా పట్టుకోమని చేయి చూపిస్తే కోతి వెళ్ళి ఆ పిల్లవాడి భుజంమీద చేయివేసేది. పిల్లవాడు తనను కరవడానికి వచ్చిందేమోననుకొనేవాడు. కాని ఆ కోతి ఎవరినీ కరిచేది కాదు. మున్నా మరీ చిన్నవాడేమీ కాదు, పదేళ్ళవాడు. అతడు బొటికి బయలుదేరినప్పుడు కోతి మున్నా భుజంమీద కూర్చునేది. మున్నా తలలో పేలుతీసి నోట్లో వేసుకొనేది. ఆ కాలంలో మనుషులు చాలా తక్కువగా క్షౌరం చేసుకొనేవారు. వాళ్ళకు స్నానంచేయాలనే సరదా కూడా ఉండేదికాదు. అంచేత అందరి తలల్లో పేలు ఎక్కువగా పడుతుండేవి. కోతి రెండుచేతులతో పేలు గబగబా తీసి నోట్లో వేసుకొంటుంటే చాలా తమాషాగా ఉంటుంది గదూ!

నేను చిలుకను

మున్నా చెల్లెలు మున్నీ గదా! ఆమె తన అన్నను అమితంగా ప్రేమించేది. మున్నా కోతిని చూసి ఆమె మనసు కూడా ఆశపడుతూ వుండేది. మున్నా అనేవాడు, 'దీన్ని తీసుకోరాదూ' కాని మున్నీ భయపడేది కూడా. ఒకరోజు ఆమె ఒక చెట్టు తొర్రలో చిలుక పిల్లలను చూసింది. చిలుక ఎక్కడికో వెళ్ళింది. వెంటనే మున్నీ ఒక పిల్లను తీసుకొని వచ్చింది. దానికి చిన్న చిన్న పురుగుల్ని తినిపిస్తూ వుంది. అందమైన పంజరం ఒకటి చేయించి అందులో వుంచింది. మున్నీ దానితో మాట్లాడేది –'తియ్యని పండు తిను. ఆకలయ్యిందా?'

నాలుగైదు మాసాలు ఇలా దాన్ని పలకరిస్తూ దానితో మాట్లాడుతూ వచ్చింది. చిలుకపిల్లకు బాగా రెక్కలొచ్చాయి. అమ్మ అన్నది – 'బయటకు తీయవద్దు, తీస్తే పారిపోతుంది'. మున్నీ అడిగింది – 'ఎందుకు పారిపోతుంది? నేను ఎంత మంచి తిండి పెడుతున్నాను! దానికోసం తియ్యని పండ్లు వెతికి తెస్తున్నాను'.

అమ్మ అన్నది – 'దీనికి కూడా అమ్మ ఉంటుంది కదా. అది తన అమ్మ దగ్గరకు పారిపోతుంది'. అంచేత మున్నీ దాన్ని యెంతో ప్రేమిస్తుంది. కాని ఆ చిలుకను పంజరంలో నుంచి మాత్రం బయటకు తీయదు.

ఒకరోజు చూసింది. చిలుక అంటూ వుంది – 'ఆకలయ్యింది. మామిడికాయ తీసుకురా. అరటికాయ తీసుకురా'. అది విని మున్నీకి చాలా ఆశ్చర్యం వేసింది. చిలుకపిల్ల మనలాగానే మాట్లాడుతున్నది. ఆమె గ్రామంలో పెంచబడిన మొదటి చిలుక ఇది. బహుశా ఈ మున్నీయే మొదట పెంచి ఉంటుంది. లేక మరో మున్నీ కూడా కావచ్చు. చిలుక కూడా మనిషి మాట మాట్లాడుతుందని మొదట మనిషికి తెలిసే వుంది. మున్నీ తన చిలుకనూ, మున్నా తన కోతినీ తీసుకొని బయటికి బయలుదేరేవాళ్ళు.

ఒకరోజు ఇద్దరు స్త్రీలు పోట్లాడుకొంటూ వున్నారు. మున్నీ నిలబడి చూస్తూ వుంది. చిలుక పంజరాన్ని అక్కడే నేలమీద పెట్టింది. మున్నీ ఇంటికి వెళ్ళిపోయింది. రాత్రిపూట చిలుకలు మౌనంగా ఉంటాయి. ఉదయం బయట చెట్లమీద పక్షుల కిలకిలలు వినిపిస్తున్నాయి. కాకి రూపమూ వికారంగానే వుంటుంది. 'కావ్ కావ్ ' మంటున్న దాని స్వరమూ కర్కశంగానే వుంటుంది. అయితే ముచ్చటగా వుంటే పక్షులు చాలా వున్నాయి. చిలుకకు తెల్లవారగానే మున్నీ ఓ తియ్యని పండు ఇచ్చింది. అది తిని అదికూడా ముందు పక్షిలాగే 'టే టే' అని అరచింది. తరువాత అది మనిషి మాటలు మాట్లాడుతున్నది – 'అడవాళ్ళ తగాదాలో విన్న మాటలు మాట్లాడుతూ వున్నది ' నీవు చావు, అవతలికి ఫో! నేనెందుకు ఛస్తాను? నీవే చావు, నిన్ను కుక్కలు పీక, నిన్ను నక్కలు పీక'. ఇంకా ఏమేమిటో అంటూ వుంది. సంతోషంగా ఉన్నప్పుడు అంటుంది – 'మున్నీగారూ ఏం చేస్తున్నారు? అన్నం తింటున్నారా? అన్నం తీసుకురండి, మంచినీళ్ళు తీసుకురండి. మున్నీగారూ, నాకు ఆకలయ్యింది'. కాని దానికి ఆకలి మాత్రం కాలేదు. అది మాట్లాడటానికే అలా అంటూ వుంది.

మున్నీ ముసలిదయిపోయింది. ఆమె కూతురు కూడా ముసలిదైపోయింది. కాని చిలుకమాత్రం అలాగే వుంది. చిలుకలు చాలా కాలం బ్రతుకుతాయి. మున్నీ తన మనమరాలు కూతురుతో అన్నది – 'నా చిన్నతనంలో నేను దీన్ని తెచ్చి పెంచాను'. ఇప్పుడు చిలుక ఇంకా ఎక్కువగా మాట్లాడుతూ వుంది.

ఏం చిలుకలు! మనుషుల్లాగా కూడా మాట్లాడతాయి!

గద్ద నుంచి విమానం దాకా

తరువాత మరో మున్నా పుట్టాడు. ఇంకా రాగియుగం కొనసాగుతూనే వుంది. మున్నా ఊశాడు, ఓ పెద్ద గద్ద ఆకాశంలో ఎగురుతూ వుంది. అది రెక్కలు కదల్చకుండా పోతూ వుంది. మున్నా అన్నాడు, 'అమ్మా నేను కూడా గద్దలాగా యెగరాలను కొంటున్నాను.' దగ్గరలోనే నిలబడి వున్న మున్నీ అన్నది, 'నీవు గద్దవై పోరాదూ!'.

మున్నా అన్నాడు, 'గద్దనెలా అయ్యేది? నేను గద్దను కావాలనే అనుకొంటున్నాను. కాని ఎలా అయ్యేది?' మున్నీ అన్నది, 'అలా అయితే నీవు యెగరలేవు.' మున్నా ఆలోచిస్తూ వున్నాడు. నేను కలలో ఎగురుతూ వుంటాను. అలా ఎందుకు ఎగరలేను? అమ్మ వివరంగా చెప్పింది – 'లేదు నాయనా, మనిషి ఎగరడు. చేపకూడా ఎగరదు. తాబేలు, ఎండ్రకాయలు కూడా ఎగరవు. సింహాలు, ఏనుగులు కూడా ఎగరవు'. పాపం మున్నా చిన్నవాడు. అతడు చాలా దిగులు పడ్డాడు. నీళ్ళలో ఈదుతూవున్నాడు. అతడన్నాడు. 'అమ్మా మనం చేపలాగా యెక్కడున్నాం? అయినా నీళ్ళలో ఈదుతున్నాం కదా! అమ్మ మళ్ళీ నచ్చజెప్పింది – ' కాని మున్నా యేడుస్తూనే వున్నాడు. మున్నీ అన్నది – 'అమ్మా



పక్షి మాత్రమే యెగరగలదా? మరెవరూ యెగరలేరా?' పళ్ళు లేకుండా ముక్కే పళ్ళుగా ఉండే పక్షులు మాత్రమే యెగరగలవు. పళ్ళున్న గబ్బిలం ఒక్కటి చర్మపు రెక్కలతో ఎగురుతుంది'. అప్పుడు మున్నా అన్నాడు. మనం కూడా చర్మం రెక్కలు తగిలించుకొంటాం, అప్పుడు యెగరలేమా?' అమ్మ మున్నా ముఖం మీద ఓ ముద్దుపెట్టి అన్నది – 'రెక్కలు అతికించుకొనడానికి వీలులేనివి. అవి పుట్టుకతోనే మొలుస్తాయి'. తాను యెగరలేనందుకు మున్నా చాలా దుఃఖిస్తున్నాడు. అతడు ఓ పిన్నిని కూడా అడిగాడు. ఆమె కూడా అలాగే చెప్పింది. 'మనిషి యెగరలేడు, ఇది వరకెన్నడూ యెగరలేడు, ఇకముందు కూడా యెప్పటికీ యెగరడు. ఎంచేతనంటే అతని దగ్గర రెక్కలు ఉండవు. అతడికి పళ్ళుకూడా ఉన్నాయి. మున్నా ఆలోచిస్తూ వున్నాడు. ఒకవేళ మన పళ్ళే ముక్కుగా వుంటే రెక్కలు కూడా మొలిస్తే యెంత బాగుండును!

మున్నా పెద్దవాడైనప్పుడు తానుకూడా అలాగే చెపుతున్నాడు – 'మనిషి యెగరలేడు'. మళ్ళీ ఓ కొత్త మున్నా వచ్చాడు. అతడూ తాను కలలో యెగురుతున్నట్లుగా చూశాడు. పక్షులు కూడా యెగురుతూ ఉండటం చూశాడు. అతడికి కూడా ఎగరాలనే ఆశ కలిగింది. మున్నాలందరూ ఎగరడం కోసం మారాం చేస్తూనే వెళ్ళిపోయారు.

మన తాతలు తండ్రులు చిన్నవాళ్ళుగా వున్నప్పుడు మోటారు కూడా పుట్టలేదు. విమానం సంగతి ఊహకే అందనిది. కాని ఈనాటి మున్నాలు – మున్నీలు ఎగురుతూనే వున్నారు. ఎంత వేగంగా ఎగురుతున్నారు! ఏ పక్షీ ఇంత వేగంగా ఎగరలేదు. విమానం తయారు చేసినవాళ్ళు మొదట చాలా చదివారు. రాత్రులంతా మేల్కొని ఎక్కాలు వల్లె వేస్తుండేవారు. ఇనుము తయారయింది. తరువాత అంతకన్న గట్టిదైన ఉక్కు తయారు చేశారు. మొదట గాలి గుమ్మటాలలో ఎగిరారు. ఇంకేముంది? తరువాత విమానాన్ని తయారుచేశారు. ఇప్పుడు మనం ఎంత హాయిగా విమానంలో పోతూ వున్నాం! ఇంతహాయి మోటారు ప్రయాణంలోనూ లభించదు, రైలు ప్రయాణంలోనూ లభించదు.

ఇది మనిషి కథ. మన కథ.
అనగనగా ఒకప్పుడు
మనిషి కూడా కోతిలాగే ఉండేవాడు.
కట్టుకోటానికి బట్టలుండేవి కాదు.
వేటాడి పచ్చి మాంసమే తినేవాడు.
నెమ్మదిగా నిప్పును కనిపెట్టాడు.
దాని ఉపయోగాన్ని తెలుసుకున్నాడు.
జంతువులతో స్నేహం చేసాడు.
వాటి సాయంతో పంటలు పండించాడు...
ఇలా మనిషి అభివృద్ధి చెందుతూ వచ్చాడు.
వేల ఏళ్ళు గడిచాయి.
ఇల్లు ఏర్పడింది.
అమ్మా నాన్న అంటే ఏమిటో తెలిసింది....
కుటుంబం ఏర్పడింది.
జాతులు, యుద్ధాలు – రాజ్యాలు ఏర్పడ్డాయి.
ఇలా సాగి, సాగి కొత్త కొత్త విషయాలను తెలుసుకొని –
ఈ ఆధునిక మానవుడు రూపొందాడు.
ఆ సమగ్ర చరిత్రే ఇది...

కావ్య పబ్లిషింగ్ హౌస్

మనిషి కథ

₹ 42/-